TS RTC STAFF & WORKERS FEDERATION
TSRTC
SWF-CITU

తెలంగాణ ఆర్టిసి కార్మికుడు

మాసపత్రిక

కార్మికుల గుండెచప్పుడు...

సంపుటి :12 సంచిక :12 | నవంబర్, డిసెంబర్, 2025 | మాసపత్రిక | వెల: రూ. 15/- | హైదరాబాద్
Volume : 12 Issue : 12 | NOVEMBER, DECEMBER, 2025 | Monthly | Price : Rs.15/- | Hyderabad



అక్టోబర్ మహా విప్లవం

తరువాయి సంచిక
లేబర్ కోడ్స్ ప్రత్యేకం











ఎస్‌డబ్ల్యూఎఫ్ ఉప ప్రధానకార్యదర్శి జి.లింగమూర్తి ఉద్యోగ విరమణ

నవంబర్ 30వ తేదీన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శి జి.లింగమూర్తి టిఐ-3 ఖమ్మం డిపోలో ఉద్యోగ విరమణ చేశారు. 1988 నుండి ఖమ్మం రీజియన్‌లో కండక్టర్‌గా తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1992లో ఎస్‌డబ్ల్యూఎఫ్‌లో చేరి అంచెలంచెలుగా ఎదిగి ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం రీజియన్ కార్యదర్శిగా పనిచేశారు. ప్రస్తుతం కరీంనగర్ జోనల్ కార్యదర్శిగా ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉప ప్రధానకార్యదర్శిగా ఉద్యమానికి సేవలందిస్తున్నారు. ఖమ్మం రీజియన్‌లో జరిగిన అనేక ఉద్యమాలకు, 2019లో జరిగిన చారిత్రాత్మక సమ్మెకు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా ఖమ్మంలో అభినందన సభ జరిగింది. ఈ సభకు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు అధ్యక్షత వహించారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రచార కార్యదర్శి పి. రవిందర్ రెడ్డి, మాజీ రాష్ట్రకార్యదర్శి ఎంవిఎస్ఎస్ నారాయణ, మాజీ ప్రచార కార్యదర్శి టివి.రావు, రాష్ట్ర ఆఫీసు బేరర్లు, పి. సుధాకర్, బాణాల రాంబాబు, జె.పద్మావతి, సిఐటియు ఖమ్మం జిల్లా కార్యదర్శి క్యాడం వెంకటేశ్వర్లు, కార్పొరేటర్ షేక్ మక్బూల్, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. రాంచందర్, కార్యదర్శి ఉపేంద్రాచారి, ఎస్‌డబ్ల్యూయు రాష్ట్ర కార్యదర్శి బత్తిని హన్మంతరావు, ఈయూ రీజియన్ కార్యదర్శి పిల్లి రమేష్, టిఎంయు రీజినల్ కార్యదర్శి ఎ.కృష్ణ, టిఎంయు రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం, సిపిఎం ఖమ్మం డివిజన్ సెక్రటరీ వై. విక్రం, రైతు సంఘం రాష్ట్ర నాయకులు, షేక్ మీరా ఎస్‌డబ్ల్యూఎఫ్ ఖమ్మం రీజినల్ అధ్యక్షులు గుండు మాధవరావు, ఎ. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. లింగమూర్తి ప్రసంగిస్తూ ఉద్యోగ విరమణ మాత్రమే చేశానని, ఉద్యమాన్ని కొనసాగిస్తానని ప్రకటించారు.

ఈ పత్రిక మీ కోసమే కాదు
మీ కుటుంబ సభ్యుల
కోసం కూడా !

తెలంగాణ ఆర్టిసి కార్మికుడు
కార్మికుల గుండె చప్పుడు
మాసపత్రిక



సంపాదకీయం

ఎడిటోరియల్ బోర్డ్
: ఎడిటర్ :
వీరాంజనేయులు
బోర్డు మెంబర్స్
వి.ఎస్.రావు,
పి.రవీందర్‌రెడ్డి
కె.ఎస్.రెడ్డి, రాపెల్లి రాజయ్య
పి.సి. ప్రకాష్, పద్మావతి
మేనేజీరియల్ బోర్డ్
మేనేజర్ : ఎస్. కృష్ణ
అసిస్టెంట్ మేనేజర్ :
కోట్ల శ్రీనివాస్‌గౌడ్
సభ్యులు
బి.రాంబాబు
ఎం. ప్రభాకర్, బి.ఉపేంద్రాచారి
ఎం.భీంరావు, వి.శ్రీనివాస్
ఫొటోలు
మద్దిలేటి మధుసూదన్/ఇసంపల్లి శామ్యూల్

తెలంగాణ
ఆర్టిసి కార్మికుడు
నండూరి ప్రసాదరావు భవన్,
1-7-130/5,
రిసాల్ ఖుర్షిద్ జాహి,
జమిస్తాన్‌పూర్,
హైదరాబాద్-20,
ఫోన్ : 040-27611974
rtckarmikudu2022@gmail.com

ప్రమాదాలు జరగకుండా చూడాల్సింది ప్రభుత్వాలే!

కేవలం 10 రోజుల వ్యవధిలో రెండు భారీ రోడ్డు ప్రమాదాలు జరిగాయి. రెండు ప్రమాదాల్లో కలిపి 38 మంది ప్రయాణీకులు చనిపోయారు. ఒకటి వేటూరి కావేరి ట్రావెల్స్ ప్రైవేటు బస్సు, రెండోది ఆర్టీసీ బస్సు. మొదటి దుర్ఘటనలో 19 మంది ప్రయాణీకులు సజీవ దహనమైతే, రెండవ దుర్ఘటనలో మరో 19 మంది సజీవంగా ఖననమయ్యారు. వేమూరి కావేరి బస్సు దహనానికి మోటార్ బైక్ కారణమైతే, తెలంగాణ ఆర్టీసీ బస్సుకి 60 టన్నుల కంకర టిప్పర్ ఢీకొట్టి 19 మంది ప్రయాణీకులను సజీవంగా ఖననం చేసింది. ఈ దుర్ఘటనలపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని కూడా సంతాపాన్ని, ఆవేదనను వ్యక్తం చేశారు. సహజంగానే దుర్ఘటనల అనంతరం కొన్ని వాహన తనిఖీలు, మరికొన్ని వాహనాల జప్తులు, ఇంకొన్ని జరిమానా విధింపుల తంతు జరిగింది. ఈ సంపాదకీయం రాస్తున్న రోజుకి అన్నీ తనిఖీలు ఆగిపోయినయి!

రోడ్డు ప్రమాదాలు జరిగి, ప్రజలు చనిపోయినపుడు ప్రముఖుల సంతాపాలు, వాహనాల తనిఖీ మన దేశంలో షరా మామూలు. ఆ తర్వాత ప్రమాదాలు, రోడ్ల స్థితిగతులు, అక్రమ ప్రైవేటు వాహనాల అడ్డగోలు వ్యవహారాల గురించి పట్టించుకునే దిక్కు మొక్కూ ఏదీ ఉండదు? మన దేశంలోనే ఎందుకీ దుస్థితి? ప్రపంచంలో జరిగే రోడ్డు ప్రమాదాల్లో 11% మనదేశంలోనే జరుగుతున్నాయి. ప్రమాదాల్లో మరణిస్తున్న వారు భారత దేశంలో 15.6%. ఇది మనం రోజూ వెనకబడ్డ దేశాలని తిట్టుకుంటున్న పాకిస్తాన్ (13%), బంగ్లాదేశ్ (15.3%) కన్నా ఎక్కువగా ఉంది.

వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు దహనానికి మోటార్‌సైకిల్ రోడ్డు మీద పడి ఉండటం, సాంకేతికమే! కాని ఆ వోల్వో బస్సు, సీటింగ్ కోసము నిర్మించబడింది. కానీ మరిన్ని లాభాల కోసం ఆపరేటర్ ఆ బస్సును స్లీపర్‌గా మార్చారు! అప్పటికీ ఆశ తీరలేదు. ఎమర్జెన్సీ డోర్‌కి అడ్డంగా బెడ్స్ ఏర్పాటు చేశారు. అయినా దురాశ వెన్నాడింది. నిషేధిత గూడ్స్ (సెల్ ఫోన్ల కార్టన్) కూడా వేసుకుని మరీ బయలు దేరారు! ఫలితంగా మంటలు చెలరేగినపుడు తప్పించుకోవడానికి ఇవన్నీ ఆటంకమై ప్రయాణీకులు సజీవ దహనమైపోయారు!

చేవెళ్ళ వద్ద జాతీయ రహదారిపై ఉన్న గుంతలు తప్పించబోయి టిప్పర్ డ్రైవర్ డివైడర్ లేకపోవటంతో ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టారు. 60 టన్నుల కంకర బస్సులోని ప్రయాణీకులను కప్పేసింది!

ఈ రెండు దుర్ఘటనల్లోనూ డ్రైవర్లను నేరస్థులుగా చిత్రీకరించబోయారు! కానీ అసలు నేరస్థులు ప్రభుత్వాలే. ప్రైవేటు బస్సుల నిర్మాణం (ఫాబ్రికేషన్) నిబంధనలకు వ్యతిరేకంగా ఉన్నా సరే ఆ బస్సు రోడ్డు మీద నడిచింది! జాతీయ రహదారిగా చెప్పబడుతున్న ఆ రోడ్డుపై గుంతలు, బ్లాక్‌స్పాట్స్ విపరీతంగా ఉన్నాయి. కానీ డివైడర్లు లేవు! ప్రజల ప్రాణాలను ప్రభుత్వాలు నడిరోడ్డుపై నిర్లక్ష్యంగా వదిలేశాయనటానికి ఈ ప్రమాదాలు ఉదాహరణలు మాత్రమే.

ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ఆత్మ విమర్శ చేసుకోవాలి! ఎం.వి. యాక్టుని సవరించటం ద్వారా ప్రైవేటు వాహనాల అక్రమ దందాలకు మద్దతు లభించిందని, ఆ సవరణలు ప్రజల ప్రాణాలకు ముప్పుగా తయారైతున్నాయని స్పష్టమవుతున్నది. 2024-25 బడ్జెట్లో 2,78,000 కోట్ల రూపాయలు కేటాయిస్తే అందులో 1,68,464 కోట్ల రూపాయలు జాతీయ రహదారులకు కేటాయించారు. మరి హైదరాబాద్ – బీజాపూర్ రోడ్డుపై గుంతలు కూడా పూడ్చలేదో ప్రకటించి, ఆతర్వాత సంతాపం తెలిపితే బాగుండేది!

ప్రమాదాలు జరిగినపుడు సంతాపాలు తెలపటం కన్నా, ప్రమాదాలే జరగకుండా ప్రభుత్వాలు బాధ్యత వహిస్తేనే ప్రజల ప్రాణాలకు విలువ, రక్షణ!

- మీ ఎడిటర్













లోపలి పేజీల్లో..

సూచిక

సంపుటి : 12 సంచిక : 12

వెల : రూ.15/-

నవంబర్, డిసెంబర్ - 2025

కవర్‌స్టోరీ	5	సందేహాలు - సమాధానాలు	18
మహబూబ్‌నగర్ రీజియన్	7	సెటైర్	19
ఖమ్మం రీజియన్	8	ప్రత్యేకాంశం	21
గ్రేటర్ హైదరాబాద్ రీజియన్	9	సభలు-సమావేశాలు	25
నల్గొం రీజియన్	10	కవితలు	26
వరంగల్ రీజియన్	11	రిప్రజంటేషన్	27
ప్రత్యేకాంశం	14	ఆర్థికం	28
అడుగుజాడలు	17	సర్క్యులర్ సమాచారం	30

మానవాళి విముక్తి మార్గం-అక్టోబర్ మహా విప్లవం



తమ్మినేని వీరభద్రం

1917 అక్టోబర్ 25-26 రాత్రి లెనిన్, ట్రాట్స్కీ నాయకత్వంలోని 'రెడ్‌గార్డ్స్' రష్యాలోని కీలక ప్రభుత్వ భవనాలు, సమాచార కేంద్రాలు, వింటర్ ప్యాలెస్ (తాత్కాలిక ప్రభుత్వం ఉన్న ప్రదేశం)ను స్వాధీనం చేసుకున్నారు. పెద్దగా ప్రతిఘటన లేకుండానే ప్రభు త్వం కూలిపోయింది. అధికారాన్ని 'సోవియట్‌ల'కు అప్పగించారు. ఆ వెంటనే విప్లవనాయకుడు లెనిన్ ప్రపంచంలోని 'తొలి సోషలిస్టు ప్రభుత్వాన్ని' స్థాపించినట్లు ప్రకటించాడు. అప్పటివరకూ ప్రపంచంలో అనేక ప్రభుత్వాలు మారినా, రాజ్యాలు కూలినా ఆ మార్పులన్నింటికంటే విశిష్టమైన, వినూత్నమైన మార్పు ఈ విప్లవం ద్వారా ప్రపంచ మానవాళి అనుభవంలోకి వచ్చింది. అదేమిటంటే అప్పటివరకూ జరిగిన మార్పులన్నీ 'ఒక దోపిడీ రూపం' మారి మరో దోపిడీ రూపం అమల్లోకి వచ్చినవే తప్ప దోపిడీ లేని రాజ్యాన్ని మానవ సమాజం ఎరగదు. కానీ అక్టోబర్ విప్లవం ద్వారా దోపిడీ, పీడన లేని సమాజం సాధ్యమేననేది ఆచరణలో రుజువయింది.

1914 నుండి 1918 వరకూ మొదటి ప్రపంచ యుద్ధం జరిగింది. ఆ కాలంలో రష్యా ప్రజలు తీవ్రమైన కష్టాల్లో మునిగిపోయారు. యుద్ధం ప్రజలపై విపరీత భారాలు మోపింది. నిరుద్యోగం, ప్రాణనష్టం, ఆహార కొరత ప్రజల జీవనాన్ని దెబ్బతీసాయి. అదేసమయంలో అధికారంలో ఉన్న జార్ నికోలస్2 పైన ఆగ్రహం పెరిగింది. ఈ పరిస్థితులను ఉపయోగించుకోవాలని దేశంలో అతర్యుద్ధం ద్వారా కమ్యూనిస్టులు అధికారంలోకి రావాలని లెనిన్ సిద్ధాంతీకరించాడు. ఆనాటి ప్రపంచంలోని ముఖ్య కమ్యూనిస్టు పార్టీలు (జర్మన్, ఫ్రెంచి, ఇటలీ వగైరా) లెనిన్ ప్రతిపాదనను వ్యతిరేకించారు. ప్రతి దేశ కమ్యూనిస్టు పార్టీ (అపుడు సోషల్ డెమొక్రటిక్ పార్టీ పేరుతో ఉండేవి) యుద్ధంలో ఆ దేశ పెట్టుబడిదారీ ప్రభుత్వాలను సమర్థించటం ద్వారా దేశభక్తిని ప్రదర్శించాలని వారు వాదించారు. ఈ విభేదాలతో రెండవ ఇంటర్నేషనల్ రద్దయింది. లెనిన్ ఒంటరివాడయ్యాడు. అయినప్పటికీ రష్యాలో బోల్షివిక్కుల నాయకత్వంలో అంతర్యుద్ధం ప్రారంభమైంది. జార్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాగిన ఈ తిరుగుబాటు పోరాటంలో బోల్షివిక్కులతో పాటు ఇతర జాతీయ బూర్జువాలు కూడా పాల్గొన్నారు.

ఈ మొదటి దశ ప్రజాతంత్ర విప్లవం జార్‌ను కూలదోసి 1917 ఫిబ్రవరిలో ఒక 'జాతీయ ప్రభుత్వాన్ని' స్థాపించింది. కానీ, ఏర్పడిన జాతీయ బూర్జువా నాయకత్వంలోని జాతీయ ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించ లేకపోయింది. యుద్ధంలో రష్యా కొనసాగటం, రైతులకు భూమి ఇవ్వలేకపోవటం, కనీసం తిండికి కూడా నోచుకోని దుర్భర పరిస్థితులు కొనసాగాయి. ఈ దశలో లెనిన్ నాయకత్వంలోని బోల్షివిక్కులు 'శాంతి-భూమి-ఆహారం' నినాదాలతో ప్రజల విశ్వాసాన్ని చూరగొన్నారు. 'అన్ని అధికారాలు సోవియట్‌లకే' అనే డిమాండ్‌తో జాతీయ ప్రభుత్వాన్ని కూల దోయాలని, సోషలిస్టు విప్లవానికి పిలుపునిచ్చారు. ఆ విధంగా 1917 అక్టోబర్ 26న రష్యాలో సోషలిస్టు విప్లవం జయప్రదమై ప్రజల ప్రభుత్వం ఏర్పడింది.(ఈ తేదీలు పాత జూలియన్ క్యాలెండర్ ప్రకారం. ఆ తర్వాత అమల్లోకి వచ్చిన గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం అది నవంబర్ 7వ తేదీ అవుతుంది. అందుకే మనం ఇపుడు అక్టోబర్ విప్లవ వార్షికోత్సవాలను నవంబర్ 7న జరుపుకుంటున్నాం.)

ప్రతిధ్వనించిన ప్రపంచం :

అక్టోబర్ విప్లవం కేవలం రష్యా సరిహద్దుల్లోనే కాదు. ప్రపంచవ్యాప్తంగా విప్లవ ఆలోచనలకు బీజం వేసింది. కార్మిక ఉద్యమాలు, వలస వ్యతిరేక పోరాటాలు, సామ్యవాద సిద్ధాంతాలు, ఇవన్నీ కూడా ఈ విప్లవం నుండి ప్రేరణ పొందాయి. అక్టోబర్ విప్లవం ఒక దేశపు పాలనా వ్యవస్థను మార్చటమే గాక, ప్రపంచ చరిత్రను కూడా కొత్త దిశలో నడిపిన విప్లవంగా మనం అర్థం చేసుకోవాలి. ఇక్కడో విషయాన్ని మనం విశ్లేషించుకోవటం అవసరం. మార్క్సిస్టు మూల సిద్ధాంతవేత్త మహనీయుడు కార్ల్ మార్క్స్ ఒక మాట చెప్పాడు. "ఇప్పటివరకూ తత్వవేత్తలు చాలామంది ప్రపం చాన్ని విశ్లేషిస్తూ వచ్చారు. కానీ అసలు విషయం దాన్ని మార్చటం." అని. అంటే ఈ మాటల అర్థం ఏమిటి? ప్రపంచం బాగుండాలని, మానవాళి అందరూ సుఖ,సంతోషాలతో జీవించాలని కోరుకున్నవాళ్లు, అందుకు తపనపడ్డవాళ్లు చాలా మందే ఉన్నారు. తత్వవేత్తలు, ప్రపంచ ప్రఖ్యాత పండితులు అనేకమంది సంపదల ఎక్కువ తక్కువలుండరాదని, అందరూ సమానంగా ఉండాలని, కులమత భేదాలు ఉండరాదని, ధనిక, పేద తారతమ్యాలు నిర్మూలించబడాలని కోరుకున్న వాళ్లూ ఉన్నారు. దేవుడూ, దెయ్యాలు లేవనీ ఇదంతా భౌతిక ప్రపంచమేనని చెప్పిన భౌతికవాదులూ ఉన్నారు. మరింత ముందుకెళ్లి ఈ రుగ్మతలకు కారణం పెట్టుబడిదారీ సమాజమే అని చెప్పినవాళ్లు కూడా ఉన్నారు.అయితే ఈ తేడాలు పోవడానికి మార్గమేమిటో, అందుకు మానవులేమి చెయ్యాలో శాస్త్రీయంగా చెప్పిన వారు, రుజువు చేసిన వారు లేరు. ఒక్క మాటలో చెప్పాలంటే ఆ మానవతావాదాలన్నీ మనిషి బుద్ధి మార్పు వల్ల సాధ్యమవుతాయని నమ్మి ప్రచారం చేయటం మనకు కనపడుతుంది తప్ప మరే శాస్త్రీయ పద్ధతీ సూచించలేక పోయారు.

అందుకే మార్క్స్ అన్నాడు. చేయాల్సింది విశ్లేషించటం కాదు. దాన్ని మార్చటం అని. అలా మార్చటానికి ప్రకృతి అంతా నిరంతరం ఏ సూత్రాల ఆధారంగా మారుతున్నదో అవే సమాజానికీ వర్తిస్తాయనీ సమాజంలోని పరస్పర భిన్న ప్రయోజనాలు కలిగి ఉన్న వర్గాల మధ్య ఘర్షణే సమాజ మార్పుకు కారణమౌతుందనీ, ఆ మార్పులు అంతిమంగా సమసమాజం వైపు పయనిస్తాయనీ సూత్రీకరించారు. ఆ విధంగా ఇదివరకు ఏ తత్వవేత్తా గమనించని అద్భుత పరిష్కారాన్ని 'మానవ సమాజ మార్పునకు వర్గపోరాటమే సాధనం'అనే పరిష్కారాన్ని మార్క్స్, ఎంగెల్స్‌లు మానవాళికి అందించారు. ఆ సమ సమాజాన్ని కోరుకునే శక్తులన్నీ చేయాల్సిందల్లా ఆయా సమాజాల్లో నిర్దిష్ట కాలంలో ఘర్షిస్తున్న వర్గ శక్తులను సక్రమంగా గమనించి వాటి మధ్య ఘర్షణను పెంచటానికి ప్రయత్నించటమే. రష్యాలో ఈ శాస్త్రీయ మార్గాన్ని అనుసరించే లెనిన్ విప్లవ విజయాన్ని సాధించాడు.

మారిన ప్రజల జీవనం : అక్టోబర్ విప్లవం తర్వాత లెనిన్ ప్రభుత్వం తీసుకున్న మొదటి నిర్ణయాలు రష్యాలో ప్రజల జీవనవిధానాన్ని పూర్తిగా మార్చేశాయి. బోల్షివిక్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రష్యాను మొదటి ప్రపంచయుద్ధం నుండి తప్పించింది. 'ప్రజలకు శాంతి కావాలి' అనే నినాదాన్ని నిజం చేస్తూ అన్ని దేశాలతో యుద్ధాన్ని నిలిపివేయాలని ప్రకటించింది. తర్వాత జర్మనీతో 1918లో బ్రెస్ట్-లిటోవస్క్ ఒప్పందం కుదుర్చుకుంది. రైతులు దీర్ఘకాలంగా కోరుకున్న భూపంపిణీని లెనిన్ ప్రభుత్వం అమలు చేసింది. భూస్వాముల,చర్చిల,రాజకుటుంబీకుల భూములను స్వాధీనం చేసుకుని రైతులకు పంచి పెట్టింది. "దున్నేవానికే భూమి" అనే సూత్రాన్ని అమలు పరిచింది. ఫ్యాక్టరీలు, గనులు, రవాణా వ్యవస్థలపై కార్మికుల నియంత్రణను చట్టబద్ధం చేసింది. కార్మికులు తమ ఉత్పత్తి, వేతనాలు, పని పరిస్థితులపై నిర్ణయాలు తీసుకునే హక్కు పొందారు. అన్ని ప్రధాన బ్యాంకులు, రైల్వేలు, పరిశ్రమలు ప్రభుత్వ అధీనంలోకి తీసుకు రాబడ్డాయి. ఈ విధానం ద్వారానే దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రజానియంత్రణ ఏర్పడింది. విద్యను ఉచితంగా సామాన్య ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఆరోగ్య సేవలను ప్రభుత్వ అధీనంలోకి తీసుకొచ్చి ప్రజాఆరోగ్య సేవల వ్యవస్థను ఏర్పాటు చేశారు. 1918లో కొత్త సోషలిస్టు రాజ్యాంగం ఏర్పాటు చేసి, అందులో స్త్రీలకు సమాన హక్కులు, ఉద్యోగ హక్కులు, పని సమయం పరిమితి, కార్మిక రక్షణల వంటివి చట్టబద్ధంగా అమలు చేశారు. ఈ నిర్ణయాలు రష్యాలో శతాబ్దాల నాటి అసమానతలను, దోపిడీ వ్యవస్థను కూలదోశాయి. లెనిన్ తీసుకున్న ఈ మొదటి అడుగులు ప్రపంచవ్యాప్తంగా సామ్యవాద ఉద్యమాలకు ప్రేరణగా మారాయి.

డెబ్భయేండ్ల సోషలిజం ఎందుకు కూలింది? : ప్రజలకు సర్వసౌఖ్యాలూ అందుబాటులోకి తెచ్చిన డెబ్భయి సంవత్సరాల సోషలిజం క్రమంగా బలహీనపడి 1989లో కుప్పకూలింది. ఎందుకిలా జరిగిందనేది అనేక మందికి ఆశ్చర్యం కలిగించటమేగాక, అనేక కమ్యూనిస్టు పార్టీలు నిరుత్సాహ పడ్డాయి. ప్రపంచ పెట్టుబడిదారీ శక్తులు బాగా పుంజుకున్నాయి. 'కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిందనీ, ఇక భవిష్యత్తు పెట్టుబడిదారీ విధానానిదేననీ, చరిత్ర అంతమైపోయిందనీ' ప్రచారం లంకించుకున్నాయి. ఈ స్థితిలో ప్రపంచవ్యాప్తంగానే కమ్యూనిస్టులు, అభ్యుదయశక్తులు సహజంగానే కొంత బలహీనపడ్డాయి. కానీ వాస్తవమేమంటే కమ్యూనిస్టు సిద్ధాంతాలకు కాలదోషం పట్టలేదు, సరిగదా ఈనాటికీ సమస్త మానవాళి ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలు చూపగలిగిన సైద్ధాంతిక స్పష్టత కమ్యూనిస్టులకు మాత్రమే ఉన్నది. సోవియట్‌లో, తూర్పు యూరోప్‌లో సోషలిస్టు రాజ్యాలు దెబ్బతిన్నది కమ్యూనిస్టు సిద్ధాంతాల వైఫల్యం వల్ల కాదు. ఆయా దేశాల్లోని కమ్యూనిస్టు పార్టీలు అనుసరించిన అపరిపక్వ విధానాలు, తప్పుల వల్ల ఆ పరిణామాలు సంభవించాయనేది ఆ తర్వాత పరిణామాల్లో స్పష్టంగా రుజువైంది. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలోకి రావటం వేరు, ఆ దేశంలో సోషలిజం నిర్మించటం వేరు. ఇవి రెండూ ఒకటికావు లేక ఆటోమేటిక్‌గా జరిగిపోవు. సోషలిజం అనేది స్వంత ఆస్తి లేని సమాజం. ఆ స్థితికి చేరటం అనేది కమ్యూనిస్టు పార్టీ ఒక దేశంలో అధికారంలోకి రావటంతోనే జరిగిపోదు. అందుకు సుదీర్ఘ కాలం అనేక రూపాల్లో ఆర్థిక వ్యవస్థ నిర్వహణ సాగించి ఆ దశకు చేరాలి. ప్రజల చైతన్యస్థాయిని బట్టి ఆస్తి రూపాలు మార్చుకుంటూ ముందుకు సాగాలి. కొంతకాలం వ్యక్తిగత ఆస్తి, పెట్టుబడిదారీ ఉత్పత్తి విధానాలు కూడా వివిధ స్థాయిల్లో అమలు జరపాల్సి ఉంటుంది. అందుకే మార్క్స్ 'సోషలిజం నిర్మాణం సుదీర్ఘకాలం ఒక యుగమంతా సాగుతుంది' అని చెప్పారు. ఈ అంశం అర్థం చేసుకుని అమలు చేయడంలో వివిధ కాలాల్లో కమ్యూనిస్టు పార్టీలు అనేక తప్పిదాలు చేశాయి. ప్రజా చైతన్యస్థాయిని పరిగణలోకి తీసుకోకుండా ఆస్తి రూపాలను సోషలిజంలోకి అధికార డిక్రీల ద్వారా అమలుకు ప్రయత్నించాయి. అలాగే కార్మికవర్గ నాయకత్వం అంటే కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంగా, దాని నాయకుల నియంతృత్వంగా మార్చిన సందర్భాలను మనం చూశాం. జరిగిన ఈ పొరపాట్లను గమనించి ఇపుడు మిగిలిన సోషలిస్టు దేశాలు అనేక ప్రయోగాలు చేస్తూ సోషలిజం నిర్మించే ప్రయత్నాలు సాగిస్తున్నాయి.

సోషలిజమే ప్రత్యామ్నాయం : ఇప్పటికే నిర్మించబడిన సోషలిస్టు రోల్‌మోడల్ ఏదీ లేనందును సోషలిజం నిర్మాణంలో అనేక తప్పిదాలు జరగటం, అనుభవంలో వాటిని సరిదిద్దుకోవల్సి రావటం సహజమే. కమ్యూనిస్టులు వర్గపోరాటాలు నిర్మించే క్రమంలో ఈ 170 సంవత్సరాల చరిత్రలో కూడా అనేక పొరపాట్లు, దిద్దుబాట్లు ఆ విధంగా జరిగాయి. ఏమైనా మానవ స్వభావం సంపూర్ణంగా వికసించటానికి అడ్డుగా ఉన్న వర్గదోపిడీ సమాజం- పెట్టుబడిదారీ సమాజం- కూల్చబడటం ఒక తప్పనిసరి పరిణామం. పెట్టుబడిదారీ విధానం కూడా ఒకేసారి నిలదొక్కుకోలేదు. అది ఒకసారి ఆవిర్భవించాక అనేక ఆటుపోట్లు ఎదుర్కొన్నది. ఆ రాజ్యాలు కూలిపోయి తిరిగి ఫ్యూడల్ రాజ్యాలు ఏర్పడటం, మళ్లీ వాటిని కూలదోసి పెట్టుబడిదారీ విధానం స్థిరపడటం జరిగింది. నేటి ప్రపంచంలో పెట్టుబడిదారీ విధానం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నది. ఈ సంక్షోభాలను అధిగమించటానికే రెండు ప్రపంచ యుద్ధాలు జరిగాయి. ఆ తర్వాత కమ్యూనిస్టులను ఎదుర్కొనటానికి, ప్రభావం తగ్గించటానికి రెండో ప్రపంచయుద్ధం తర్వాత 'సంక్షేమ రాజ్యం' నమూనాను పెట్టుబడిదార్లు అమలు చేశారు.

అయినా సంక్షోభ పరిష్కారం జరగక కొత్త సంక్షోభాలు ముందుకొచ్చాయి. దాని పరిష్కారానికి '1970ల తర్వాత, ఇండియాలో 1990ల నుండి 'ప్రపంచీకరణ విధానాలు' అమలు చేశారు. కానీ ఇపుడు ఆ విధానాలు కూడా విఫలమై సామ్రాజ్యవాద నాయకుడుగా ఉన్న అమెరికా తన ఆధిపత్యం నిలుపుకోవటానికి ప్రపంచీకరణ నుండి విరమించుకుని తిరిగి అనేక దేశాలపైన నేడు టారిఫ్‌ల విధింపు రూపంలో తిరిగి 'రక్షణాత్మక విధానాలు' అనుసరించటానికి పూనుకుంటున్నది. ఈ విధానాలను చైనా, రష్యాల నాయకత్వంలో బ్రిక్స్, ఎస్.సి.ఓ సంస్థల రూపంలో సంఘటితమౌతున్న అనేక దేశాలు ప్రతిఘటిస్తున్నాయి. అమెరికా ఆధిపత్యాన్ని సవాల్ చేస్తున్నాయి. ఈ పరిణామాలన్నీ 'చరిత్ర ముగిసిపోయింది. ఇక పెట్టుబడిదారీ విధానమే అంతిమం' అని చెప్పిన బూర్జువా పండితుల జోస్యాలను పటాపంచలు చేస్తున్నాయి. 'సోషలిజమే ప్రత్యామ్నాయమనే నిజాన్ని' ఎలుగెత్తి చాటుతున్నాయి. అక్టోబర్ మహావిప్లవ స్ఫూర్తితో ఈ బాటలో ముందుకు సాగటమే మానవాళి మనుగడకు, వసుధైక కుటుంబ సాధనకు మన ముందున్న మార్గం.

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బ్యాడ్జీలు ధరించిన కార్మికులు



కల్వకుర్తిలో..



మహబూబ్‌నగర్‌లో..



నాగర్‌కర్నూల్‌లో..



షాద్‌నగర్‌లో..



అచ్చంపేటలో..



వనపర్తిలో..

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బ్యాడ్జీలు ధరించిన కార్మికులు



భద్రాచలంలో..



సత్తుపల్లిలో..





ఖమ్మంలో..



మణుగూరులో..



కొత్తగూడెంలో..



మధిరలో..

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బ్యాడ్జీలు ధరించిన కార్మికులు



జీడిమెట్లలో..



బర్కత్‌పురలో..



ఇబ్రహీంపట్నంలో..



ముషీరాబాద్‌లో..



రాజేంద్రనగర్‌లో..

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బ్యాడ్జీలు ధరించిన కార్మికులు



సూర్యాపేటలో..



యాదగిరిగుట్టలో..





నల్గొండలో..





మిర్యాలగూడలో..

విద్యుత్తు బస్సులు ఆర్టీసీకే ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బ్యాడ్జీలు ధరించిన కార్మికులు



హన్మకొండలో..



వరంగల్‌లో..



పరకాలలో..



మంథనిలో..



సివిటీయు రాష్ట్ర నాయకత్వానికి శ్రామిక మహిళా నిధి అందిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు

ఆధునిక భారతదేశ శిల్పి జవహర్లాల్ నెహ్రూ



రాపెల్లి రాజయ్య
SWF నాయకులు

జవహర్లాల్ నెహ్రూ 1889 నవంబర్ 14 న బ్రిటిష్ ఇండియాలోని అలహాబాద్ లో తల్లి స్వరూప రాణి మరియు తండ్రి మోతిలాల్ నెహ్రూ దంపతులకు జన్మించారు. తల్లిదండ్రులు ఇద్దరు కాశ్మీరీ పండితులు లేదా కాశ్మీర్ లోయకు చెందిన బ్రాహ్మణ సమాజానికి చెందినవారు. మోతిలాల్ నెహ్రూ ఆ రోజుల్లోనే నెలకు పదివేల రూపాయలు సంపాదించే ఒక పేరున్న లాయర్. వారికి జవహర్ లాల్ నెహ్రూ మొదటి సంతానం కాగా పెద్ద కుమార్తె విజయలక్ష్మి మరియు చిన్న కుమార్తె కృష్ణహుతి సింగ్.

నెహ్రూ బాల్యం అలహాబాద్ లోని ఆనంద్ భవన్ లో సాగింది. ఆయన ఇంట్లోనే ప్రైవేట్ గవర్నెన్స్ మరియు ట్యూటర్ల ద్వారా విద్యను అభ్యసించారు. వారిలో ఒకరు ఐరిష్ వ్యక్తి ఫెర్టినాండ్ టి బ్రూక్స్ మరియు ఇంకొకరు ఇండియన్ హోమ్ రూల్ లీగర్ శ్రీమతి అన్నిబిసెంట్. పాఠశాల విద్యను ఇంగ్లాండ్లో చదివించాలని నిర్ణయించుకున్న మోతిలాల్ నెహ్రూ కుటుంబంతో కలిసి లండన్ వెళ్లి అక్కడ ప్రతిష్టాత్మక హోరో పాఠశాలలో జవహర్లాల్ నెహ్రూకు సీటు సాధించాడు. నెహ్రూ 1977 అక్టోబర్లో కేంబ్రిడ్జ్ లోని ట్రినిటీ కాలేజీలో చేరి రాజకీయాలు, ఆర్థిక శాస్త్రం, చరిత్ర, సాహిత్యం సబ్జెక్టులతో ఆనర్స్ డిగ్రీని సాధించాడు.



1910 లో డిగ్రీ పూర్తి చేసిన తర్వాత నెహ్రూ లండన్ కి వెళ్లి ఇన్నర్ టెంపుల్ లో న్యాయ శాస్త్రం అభ్యసించాడు. 1912 ఆగస్టులో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత నెహ్రూ అలహాబాద్ హైకోర్టులో చేరి న్యాయవాదిగా స్థిరపడటానికి ప్రయత్నించారు. 1916 లో నెహ్రూ ఢిల్లీలో స్థిరపడిన కాశ్మీర్ పండిట్ కుటుంబం నుంచి వచ్చిన కమలా కౌల్ ను వివాహం చేసుకున్నాడు. వారికి ఏకైక కుమార్తె ఇందిర 1917లో జన్మించింది. కమల 1924 లో ఒక కొడుకుకు జన్మనిచ్చింది. కానీ ఆ బిడ్డ కొన్ని రోజులు మాత్రమే జీవించింది.

1916 లో లక్నోలో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ మొదటిసారిగా గాంధీని కలిశారు. 1919 డిసెంబర్లో నెహ్రూ తండ్రి మోతిలాల్ నెహ్రూ భారత జాతీయ కాంగ్రెస్కు అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1920లో గాంధీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమంలో నెహ్రూ యునైటెడ్ ప్రావిన్సెస్ (ఇప్పుడు ఉత్తరప్రదేశ్) ప్రాంతీయ కార్యదర్శిగా రాజకీయ కార్యకలాపాలను నిర్దేశించడంలో ప్రభావంతమైన పాత్ర పోషించాడు. ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలపై జవహర్లాల్ నెహ్రూ 1921 జనవరి 6న జైలు పాలయ్యారు. విడుదలైన తర్వాత 1926 లో నెహ్రూ తన భార్యకు క్షయ వ్యాధి నిర్ధారణ చికిత్స కోసం, భార్య మరియు కుమార్తెతో కలిసి యూరప్ వెళ్లారు. యూరప్ లో ఉన్నప్పుడు బెల్జియంలోని బ్రెస్సెల్ లో జరిగే అణగారిన వర్గాల జాతీయ కాంగ్రెస్ కు హాజరు కావడానికి నెహ్రూను ఆహ్వానించారు. ఈ సమావేశంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రారంభమైన లీగ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ కు ఎన్నికయ్యారు. నెహ్రూ యూరప్ లో బస చేసినప్పుడు సోవియట్ యూనియన్ ను సందర్శించారు. ఈ సమయంలో ఆయనకు మార్క్సిజం మరియు సోషలిజంపై ఆసక్తి పెరిగింది. కారల్ మార్క్స్ ఆలోచనలతో పూర్తిగా ఏకీభవించకపోయినప్పటికిని అతని ఆర్థిక దృక్పథం మాత్రం మార్క్సిస్ట్ గా మార్చగలిగింది. 1927 లో భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత నెహ్రూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా మరో రెండేళ్లు పదవీ కాలానికి ఎన్నికయ్యారు. 1929 డిసెంబర్ 29 న లహోర్ సమావేశంలో నెహ్రూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి పదవికి ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో నెహ్రూ పూర్తి స్వాతంత్రం కోసం తీర్మానాన్ని ప్రవేశపెట్టారు.

1929 నూతన సంవత్సర వేడుకల సందర్భంగా అర్ధరాత్రి నెహ్రూ లాహోర్లో రావి నది ఒడ్డున భారతదేశ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. స్వాతంత్ర్య ప్రతిజ్ఞ చదివి వినిపించారు. జనవరి 26న స్వతంత్ర దినోత్సవం గా పాటించాలని పిలుపునిచ్చారు.

1930లో బ్రిటిష్ వారు ప్రవేశపెట్టిన ఉప్పుపై పన్నును లక్ష్యంగా చేసుకొని, ఉప్పును తయారు ఊఊచేయడం ద్వారా పౌర అవిధేయతను ప్రారంభించాలని గాంధీజీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెహ్రూ ఉప్పును తయారు చేశారు. అలహాబాద్ నుండి రాయపూర్ కు రైల్లో వెళ్తుండగా నిషిద్ధ ఒప్పును తయారు చేసి, చట్టాన్ని ఉల్లంఘించినందుకు అరెస్టు చేసి సెంట్రల్ జైల్లో ఆరు నెలలు శిక్ష విధించారు. 1935 సెప్టెంబర్లో నెహ్రూ భార్య కమల జర్మనీలోని బార్డెన్ వీలర్ లో వైద్య చికిత్స పొందుతూ తీవ్ర అనారోగ్యానికి గురైంది. నెహ్రూ కారుణ్య కారణాలతో జైలు నుండి విడుదలై అతని భార్యను స్విట్జర్లాండ్ లోని లౌసాన్ లో ఒక సానిటోరియం కు తీసుకెళ్లారు. అక్కడ ఆమె ఫిబ్రవరి 28, 1936 న మరణించారు.

రెండవ ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు ఎన్నికైన భారతీయ ప్రజాప్రతినిధులను సంప్రదించకుండానే వైస్రాయ్

లిన్ లిత్ గో ఏకపక్షంగా భారతదేశాన్ని బ్రిటన్ పక్షాన యుద్ధ వీరుడిగా ప్రకటించాడు. అనేక చర్చల తర్వాత నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్, బ్రిటిష్ ప్రభుత్వానికి సహకరిస్తామని, యుద్ధం తర్వాత భారతదేశానికి పూర్తి స్వాతంత్రం హామీ ఇవ్వాలని, కొత్త రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ సభ ఎన్నికను అనుమతించాలని, భారత సాయుధ దళాలను కేంద్ర ప్రభుత్వంలో చేర్చుకోవాలని ప్రతిపాదించారు. కానీ వైస్రాయ్ లిన్ లిత్ గో ఈ ప్రతిపాదనను తిరస్కరించారు. 1939 అక్టోబర్ 23 న వైస్రాయ్ వైఖరిని కాంగ్రెస్ ఖండించి, వివిధ ప్రావిన్స్ లలోని కాంగ్రెస్ మంత్రులను రాజీనామా చేయాలని పిలుపునిచ్చింది. 1940 లో మహమ్మద్ ఆలీ జిన్నా "ముస్లింలు ఒక జాతి మరియు వారికి వారి మాతృభూమి, వారి భూభాగం మరియు వారి రాష్ట్రం ఉండాలి" అని ప్రకటించారు. ఈ రాష్ట్రాన్ని పాకిస్తాన్ (స్వచ్ఛమైన భూమి) అని పిలవాలని ప్రకటించారు. నెహ్రూ ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. హిందూ ముస్లింల రాజీ కోసం తీవ్రంగా కృషి చేశారు. అక్టోబర్ 1940 లో గాంధీ మరియు నెహ్రూ బ్రిటన్ కు మద్దతు ఇచ్చే విషయాన్ని పక్కన పెట్టి, పరిమిత పౌర అవిధేయత ప్రచారాన్ని ప్రారంభించాలని నిర్ణయించారు. 1942 లో గాంధీజీ బ్రిటిష్ వారిని దేశం విడిచి వెళ్లాలని పిలుపునిచ్చాడు. మిత్ర దేశాల యుద్ధ ప్రయత్నాలను ఇబ్బంది పెట్టడానికి నెహ్రూ ఇష్టపడకపోయినా, గాంధీతో చేరడం తప్ప వేరే మార్గం లేదు. 1942 ఆగస్టు 8న బొంబాయిలో కాంగ్రెస్ పార్టీ ఆమోదించిన క్విట్ ఇండియా తీర్మానం తర్వాత గాంధీ మరియు నెహ్రూతో సహా అబ్దుల్ కలాం ఆజాద్ మరియు సర్దార్ వల్లభాయ్ పటేల్తో సహా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలోని చాలామందిని అహ్మద్నగర్ కోటలో జూన్ 15, 1945 వరకు నిర్బంధించారు.

1946లో అధికార బదిలీ కోసం ప్రణాళికలను ప్రతిపాదించడానికి భారతదేశానికి వచ్చిన క్యాబినెట్ మిషన్ ప్రాంతీయ అసెంబ్లీ ఎన్నికలను అనుమతించింది. ఎన్నికైన అసెంబ్లీ సభ్యులు, రాజ్యాంగ సభ సభ్యులను ఎన్నుకున్నారు. కాంగ్రెస్ అసెంబ్లీలో మెజార్టీ సీట్లను గెలుచుకుంది మరియు నెహ్రూ ప్రధానమంత్రిగా తాత్కాలిక ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. తర్వాత ముస్లిం లీగ్ ప్రభుత్వంలో చేరింది. నెహ్రూ 16 సంవత్సరాలు ప్రధానమంత్రిగా పనిచేశారు. మొదట తాత్కాలిక ప్రధానమంత్రిగా, తర్వాత 1947 నుంచి భారత దేశానికి డొమినియన్ ప్రధానమంత్రిగా మరియు 1950 నుండి భారత గణతంత్ర ప్రధానమంత్రిగా పనిచేశారు.

1948 జనవరి 30న గాంధీజీ హత్య తర్వాత భారతీయులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. హంతకుడు నాథూరాం గాడ్సే హిందూ మహాసభ పార్టీతో సంబంధాలు ఉన్న హిందువు, జాతీయవాది, పాకిస్తాన్ కు చెల్లింపు చేయాలని పట్టుబట్టడం ద్వారా భారతదేశాన్ని బలహీనపరిచేందుకు గాంధీయే కారణమని పేర్కొన్నాడు. ప్రభుత్వ అధికారాన్ని నొక్కి చెప్పడం, అన్ని మతపరమైన పారా మిలిటరీ సమూహాలను అణచి వేయడం కోసం నెహ్రూ మరియు పటేల్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (RSS), ముస్లిం నేషనల్ గార్డ్స్ మరియు ఖక్సర్లను నిషేధించారు.

1949 నవంబర్ 26 న రాజ్యాంగం ఆమోదించిన తర్వాత కొత్త ఎన్నికలు జరిగే వరకూ రాజ్యాంగ సభ తాత్కాలిక పార్లమెంటుగా వ్యవహరించింది. భారత కొత్త రాజ్యాంగం కింద జాతీయ పార్లమెంటు మరియు రాష్ట్ర అసెంబ్లీలకు 1952 లో మొదటి ఎన్నికలు జరిగాయి. నెహ్రూ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మరియు జాతీయస్థాయిలో భారీ మెజార్టీని గెలుచుకుంది. 1962లో నెహ్రూ కాంగ్రెస్ ను తక్కువ మెజార్టీతో నడిపించారు. కమ్యూనిస్టు మరియు సోషలిస్ట్ పార్టీల కు ఓట్లు వేసిన వారి సంఖ్య పెరిగింది.

నెహ్రూ ప్రభుత్వ రంగం మరియు ప్రైవేటు రంగంతో కలిసి ఉండే మిశ్రమ ఆర్థిక వ్యవస్థను సమర్థించాడు. ప్రాథమిక మరియు భారీ పరిశ్రమలను స్థాపించడం ద్వారా అభివృద్ధి చెందుతారని భావించాడు. అనేక బహుళార్థక సాధక ప్రాజెక్టులను నిర్మించడం ద్వారా వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేశారు. భారతదేశ పిల్లలకు విద్యను అందించడానికి నెహ్రూ ఎంతో ఆసక్తి చూపారు. ఆయన ప్రభుత్వం ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (AIMS), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (IIT), ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ (IIM), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (NIT) లతోపాటు అనేక ఉన్నత విద్యాసంస్థలను స్థాపించింది. పాఠశాలల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి ఉచిత పాలు మరియు భోజనాన్ని అందించడానికి నెహ్రూ చొరవ చూపారు. వయోజన విద్యా కేంద్రాలు వృత్తి మరియు సాంకేతిక పాఠశాలలు గ్రామీణ ప్రాంత వయోజనుల కోసం ప్రారంభించారు. ప్రధానమంత్రిగా సుదీర్ఘకాలం పదవిలో ఉన్న నెహ్రూ విదేశాంగ శాఖను కూడా నిర్వహించారు. ప్రచ్ఛన్న యుద్ధ సమయంలో భారతదేశం ఏ కూటమిలో చేరకుండా స్వతంత్రంగా ఉంటుంది అని అలిన విధానాన్ని ప్రకటించారు. ఈ అలిన విధానాన్ని అనేక దేశాలు సమర్థించి, అందులో చేరాయి. అత్యంత సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికిని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం భారతదేశ స్వాతంత్రం కోసం ఆయన నిరంతరం కృషి చేశారు. ఆయన జీవితకాలంలో దాదాపు 9 సంవత్సరాలు జైల్లోనే గడిపారు. భారతదేశానికి స్వేచ్ఛను సాధించడంతోపాటు, అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టిన జవహర్లాల్ నెహ్రూకు భారతీయులందరూ రుణపడి ఉంటారు.

రోడ్డు ప్రమాదాలు - మరణాలు - కారణాలు - నివారణ



జె. దివాకర్,
రాష్ట్ర మాజీ కోశాధికారి,
ఏపీఎస్ ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్.
సెల్ : 73828 66510

ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాలు, భారీ సంఖ్యలో జరిగిన మరణాలపై పలు రకాల కథనాలు వెలువడినాయి. ఈ ప్రమాదాలతో పాటు రోజు దేశంలో అనేక ప్రాంతాలలో రోడ్డు ప్రమాదాలు, మరణాలు చోటు చేసుకుంటున్నాయి. వీటికి కారణాలు ఏమిటి? బాధ్యత ఎవరిది? నివారణకు తీసుకోవలసిన నిర్దిష్ట చర్యలు పరిశీలిద్దాం!

1) మౌలిక సదుపాయాల కల్పన: (Infrastructure Building). 2) అవగాహన కల్పించడం: (Create Awareness). 3) చట్ట నిబంధనల అమలు (Enforcement). ఈ మూడు కీలకమైన అంశాలు. అలాగే మొదట మౌలిక సదుపాయాల కల్పన ఆ తర్వాత అవగాహన చివరిగా మాత్రమే నిబంధనల అమలు జరగాలి.

మౌలిక సదుపాయాలు: రహదారులు మూడు రకాలు. (A) జాతీయ రహదారులు (B) రాష్ట్ర రహదారులు (C) ఇతర రహదారులు. మొత్తం దేశంలోని రహదారులలో జాతీయ రహదారుల వాటా కేవలం రెండు శాతం మాత్రమే. అయినా 40% వాహనాలు రద్దీని, భరిస్తున్నాయి. 36 శాతం ప్రమాదాలు ఈ జాతీయ రహదారులోలనే జరుగుతున్నాయి.



ప్రధాన కారణాలు: 1) ద్విచక్ర వాహనాలు మొదలుకొని 30చక్రాల భారీ వాహనాలు, అత్యధిక వేగంతో వెళ్లే అధునాతన కార్లు మొత్తం ఒకే రోడ్డులో వెళుతున్నాయి.

2) జాతీయ రహదారుల నిర్మాణంలో తీవ్రమైన లోపాలు/తప్పిదాలు/ నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయి. జాతీయ రహదారులు గ్రామాలు/పట్టణాల మధ్య గుండా వెళ్ళకూడదు. ఉదాహరణ చిలకలూరిపేట పట్టణం గుండా జాతీయ రహదారి వెళ్ళింది. అయితే ఇప్పుడు దానిని సరిచేసి బైపాస్ రోడ్డు నిర్మాణం జరిగింది. హైదరాబాదు విజయవాడ మధ్య చౌటుప్పల్ తదితర ప్రధాన కేంద్రాల మధ్య నుండి ఇప్పటికి జాతీయ రహదారి ఉంది.

3) రహదారి మధ్యలో రోడ్డు వెడల్పు అకస్మాత్తుగా తగ్గించకూడదు. ఉదాహరణ: చేవెళ్ల దగ్గర జాతీయ రహదారి సుమారు 45 కిలోమీటర్ల దూరం వెడల్పు కుదిరించబడింది. (చేవెళ్ల ప్రమాదం తర్వాత మరల వెడల్పు పనులు ప్రారంభమైనట్లు పత్రికల్లో వార్తలు వచ్చాయి)

4) జాతీయ రహదారిలో రైట్ టర్న్ తీసుకోవడానికి అవకాశం ఉండకూడదు. ఒకవేళ రైట్ టర్న్ తీసుకోవాలనుకుంటే జంక్షన్ నిర్మాణం జరగాలి. జంక్షన్ నిర్మాణం స్థల సేకరణ ఖర్చుతో కూడినదైనప్పుడు రైట్ టర్న్ కి ఐదు కిలోమీటర్ల ముందు నుండే డైరెక్షన్స్ కంటిన్యూగా బోర్డు ద్వారా తెలియజేయాలి. బోర్డు బాగా కనపడేటట్లు 2/2 మీటర్ల సైజులో ఏర్పాటు చేయాలి.

5) రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు మరియు ప్రతికూల వాతావరణ పరిస్థితులు, తదితర సమాచారాన్ని వెనువెంటనే సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఆ రహదారిలో తగిన హెచ్చరికలు, సూచనలు జారీ చేసే ఏర్పాటు చేయాలి. ఇవన్నీ మౌలిక సదుపాయాల కల్పన. ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలి. ప్రైవేట్ కాంట్రాక్టర్లు నిబంధనలను ఉల్లంఘిస్తే, వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు తక్షణం వాటిని ఆ కాంట్రాక్టర్ సరిదిద్దేలా ప్రభుత్వం బాధ్యత వహించాలి.

లైసెన్సింగ్ విధానం: ప్రపంచంలోని అనేక దేశాలలో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణత సాధించటం కంటే డ్రైవింగ్ లైసెన్స్ సాధించటం కష్టతరం. ఆయా దేశాలలో డ్రైవింగ్ లైసెన్స్ పొందాలంటే రెండు దశల పరీక్షలలో ఉత్తీర్ణత పొందాలి. ఇందులో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేదు.

మొదటిది థీరీ టెస్ట్: రెండవది ప్రాక్టికల్ టెస్ట్: మొదట థియరీ పరీక్ష ఉత్తీర్ణత పొందిన తర్వాతనే విధిగా శిక్షణ పొంది ప్రాక్టికల్ టెస్ట్ కు హాజరు కావాలి. జాతీయ రహదారిలో పట్టణాలలో నగరాలలో ప్రాక్టికల్ పరీక్ష ఉంటుంది. ఎక్కడ ఫెయిల్ అయినా మరలా శిక్షణ ప్రాక్టికల్ పరీక్షకు హాజరు కావడం అనివార్యం. అంతటి కఠినమైన, ఖచ్చితమైన లైసెనింగ్ విధానం ఆ దేశాలలో ఉంది. జాతీయ రహదారులలో వాహనాలు (Lane) ఒకే లేన్ లోనే వెళ్లాలి. ఒకవేళ అటో ఇటో లైన్ మారాల్సి వస్తే సిగ్నల్ ఇచ్చి, వెనుక నుండి ఇతర వాహనాలు రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే వేరే లైన్ లోకి మారాలి. మన లైసెన్సింగ్ విధానాల్లోనే కీలకమైన ఈ లోపాలు ఉన్నాయి.

(II)అవగాహన: ప్రపంచ దేశాలలో బాటసారి రాజు, అతని ప్రాణాలను కాపాడడం బాధ్యత, ప్రాథమిక విద్య స్థాయి నుంచి క్రమశిక్షణ రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలు

ప్రజలందరికీ నేర్పి పాటించేలా తగిన చర్యలు తీసుకుంటారు. అంతటి అవగాహనతో ప్రజలను/డ్రైవర్లను/ రోడ్డు వినియోగదారులను ఎడ్యుకేట్ చేస్తారు. ఇప్పుడు మన తెలుగు రాష్ట్రాలలో జరిగిన ఘోర ప్రమాదాలు, ప్రభుత్వ వైఫల్యాలు పరిశీలిద్దాం!

1) చేవెళ్ల ప్రమాదం: చేవెళ్లకముందు తర్వాత మొత్తం సుమారు 45 కిలోమీటర్ల నిడివి రోడ్డు కేవలం "సింగిల్ రోడ్డు" గా ఉండటం. జాతీయ రహదారి నిర్మాణం మధ్యలో ఇలా ఉండటం నిబంధనల ఉల్లంఘన. అయితే పర్యావరణవేత్తల కోర్టు కేసు వల్ల ఆ బిట్ రహదారి విస్తరణ పని నిలిచిపోయిందని చెబుతున్నారు. ఒకవేళ కోర్టు కేసు కారణంగానే రోడ్డు విస్తరణ ఆపవలసిన అనివార్య పరిస్థితి ఏర్పడితే ప్రమాదాలు మరణాలు నివారించడానికి అవసరమైన తాత్కాలిక చర్యలు విధిగా చేపట్టాలి. ఉదాహరణకు మలుపులు ఉన్న ప్రతి దగ్గర ముందు నుంచే సూచనలు తెలియజేసే బోర్డులు, స్పీడ్ బ్రేకర్ల, పోలీసింగ్ ఏర్పాట్లు చేయాలి. అవసరమైతే కొంత సమయం ఒకవైపు వాహనాలను మాత్రమే అనుమతించి, మరి కొంత సమయం రెండోవైపు వాహనాలు అనుమతించాలి. ఈ తాత్కాలిక చర్యలు తీసుకోవడానికి కోర్టు కేసులు అడ్డంకి కానేకాదు. ప్రజల ప్రాణాల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి సంబంధించిన అంశం మాత్రమే. ప్రమాదం జరిగిన తర్వాత ప్రభుత్వం పర్యావరణ వేత్తలతో సంప్రదింపులు జరిపి ఒక అంగీకారానికి వచ్చి తిరిగి రోడ్డు పనులు ప్రారంభించినట్లు వార్తలు వచ్చాయి. ఈ ప్రయత్నం ముందే చేసి ఉంటే చేవెళ్ల ప్రమాదం జరిగేది కాదు. ఆరు నెలల క్రితం ఇదే సమస్యపై శాసనసభలో చర్చ జరిగిన తరువాత నైనా రాజీ ప్రయత్నం చేసి ఉంటే ఈ ఆరు నెలల కాలంలో జరిగిన ప్రమాదాలు నివారించబడేవి.



2)కావేరి ట్రావెల్స్ బస్సు ప్రమాదం: కావేరి ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సు మోటార్ సైకిల్ ను గుద్ది సుమారు 200 మీటర్లు ఈడ్చుకెళ్లడం ద్వారా ప్రమాదం జరిగిందని ప్రాథమిక నివేదికలు తెలియ జేస్తున్నాయి. ద్విచక్ర వాహన ప్రమాదం జరిగిన వెంటనే ఆ ప్రమాద సమాచారం తో సాంకేతికపరమైన హెచ్చరికలు, సూచనలు రహదారిలో జారీచేసి ఉంటే ఈ ప్రమాదం జరిగేది కాదు. లిప్రయాణికుల బస్సులో అనుమతించ కూడని ప్రేలుడు స్వభావం కలిగిన సెల్ ఫోన్లను అనుమతించడంతో ప్రమాద తీవ్రత పెరిగింది. సీటింగ్ బస్సును స్లీపర్ బస్సుగా మార్చడం. అత్యవసర ద్వారాలు లేవు. అత్యవసర పరిస్థితుల్లో బయటికి రావడానికి సుత్తిలాంటి పరికరాలు కూడా అందుబాటు లేవు. విధిగా ఉండాల్సిన రెండు అగ్ని ప్రమాద నివారణ యంత్రాలు బస్సులో ఏర్పాటు చేయలేదు. కర్నూడి చావుకి కారణాలు అనేకం అన్నట్లుగా పైన ఉదాహరించిన ఘోరమైన ఉల్లంఘనలు కారణంగా 19 మంది ప్రయాణికులు సజీవంగా దహనమైనారు.

3) జబ్బార్ ట్రావెల్స్ ప్రమాదం: 2014లో మహబూబ్ నగర్ జిల్లా పాలెం సమీపంలో జబ్బార్ ట్రావెల్స్ బస్సు ప్రమాదంలో సుమారు 45 మంది సజీవంగా దహన మైనారు. ప్రమాదం జరిగిన చోట జాతీయ రహదారి రోడ్డు వెడల్పు తగ్గించబడింది. అలా రోడ్డు వెడల్పు తక్కువగా ఉంది అనే ముందస్తు సూచి బోర్డులు లేవు. కల్వర్టు సైడ్ రైలింగ్ వాల్ కు ఉపయోగించిన ఇనుప కమ్మీలు పూర్తిగా సిమెంట్తో కప్పబడకుండా ఒక కమ్మీ బయటికి ఉన్నది. ఆ ఇనుప కమ్మి బస్సు ఆయిల్ ట్యాంక్ కి తగిలి నిప్పురవ్వలు చెలరేగి బస్సు తగలబడింది.

4)విశాఖబిశ్రీకాకుళం రోడ్డు ప్రమాదం: చెన్నై నుండి కోల్కత్తా వెళ్లే జాతీయ రహదారిలో విశాఖబిశ్రీకాకుళం మధ్య జరిగిన ప్రమాదంలో కేంద్ర మంత్రివర్యులు ఎర్రం నాయుడుగారు చనిపోయారు. జాతీయ రహదారిలో ఎలాంటి హెచ్చరికలు/సూచనలు లేకుండా కుడి వైపుకు మరలెందుకు నిర్మాణంలోనే అవకాశం ఇవ్వడం వల్ల ఆ ప్రమాదం జరిగింది. శ్రీకాకుళం వైపు నుంచి విశాఖ వైపు వెళ్తున్న లారీ డ్రైవరు ప్రమాదం జరిగిన ప్రాంతంలో రైట్ టర్న్ తీసుకున్నాడు. అదే సమయంలో ఎర్రం నాయుడు గారి కారు అక్కడికి రావడంతో ప్రమాదం జరిగింది ఇలాంటి ఉల్లంఘనలు దేశంలోని

5) హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ప్రమాదాలు: హైదరాబాద్ -విజయవాడ జాతీయ రహదారిలో నార్కెట్ పల్లి నుండి వచ్చే వాహనాలు కామినేని హాస్పిటల్ దగ్గర జాతీయ రహదారిలో కలుస్తాయి. ఇక్కడ (హైదరాబాదు ఓ ఏ వైపు) జాతీయ రహదారి చాలా వాలుగా (స్లోప్) ఉంది. రోడ్డు స్లోప్ ఉండటంతో పాటు నార్కెట్ పల్లి నుంచి జాతీయ రహదారిలోకి వాహనాలు వస్తాయి కనుక జాతీయ రహదారిలో రెండువైపులా (విజయవాడ వైపు హైదరాబాద్ వైపు) తగిన సూచికలు హెచ్చరికలు/సూచనల బోర్డుల ఏర్పాటు ఉండాలి. ఇది లేని కారణంగానే అక్కడ చాలా ప్రమాదాలు జరిగాయి. పై 5 ప్రమాద సంఘటనలను పరిశీలిస్తే

1)రోడ్ల నిర్మాణంలో తీవ్ర లోపాలు/ తప్పిదాలు,

2) ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో విఫలం,

3)ఉల్లంఘనలకు పాల్పడిన కాంట్రాక్టర్లపై ఎలాంటి చర్య తీసుకోకపోవడం, వాటిని సరిదిద్దే విధంగా అజమాయిషి చేయకపోవడం, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు యజమానులు నిబంధనలను ఉల్లంఘించిన పట్టించుకోక పోవడం ప్రభుత్వ వైఫల్యాలు. పై అంశాల నేపథ్యంలో ప్రమాదాలకు, మరణాలకు

కారణం అయిన ప్రభుత్వమే ప్రధానమైన ముద్దాయి.

రోగం ఒకటి-వైద్యం వేరొకటి: ప్రభుత్వ యాజమాన్య వైఫల్యాలను మరుగునపరిచి డ్రైవర్లు అతి వేగంగా, నిర్లక్ష్యంగా నడపడం వల్లనే ప్రమాదాలు జరిగాయని డ్రైవర్లను బలి పశువులను చేసి, ప్రభుత్వ బాధ్యతల నుంచి వైదొలగే ప్రయత్నాలు జరుగుతున్నాయి. అలాగే బండి రిజిస్ట్రేషన్ ఫిట్నెస్ ఇన్సూరెన్స్ ఓవర్ లోడ్ తదితర సాంకేతిక అంశాలకే రవాణా శాఖ అధికారులు పరిమితం చేస్తున్నట్లుగా పత్రికల్లో వార్తలు వస్తున్నాయి. ఇవన్నీ చట్ట నిబంధనలకు సంబంధించిన అంశాలు. తప్పనిసరిగా పాటించాల్సిందే. అయితే ప్రమాదాలు జరిగినప్పుడే గుర్తుకు రావడం, మేలుకోవడం బాధ్యతా రాహిత్యం తప్ప మరొకటి కాదు.

విదేశీ అనుభవాలు:

1)స్వీడన్: ప్రమాదం జరిగినా ప్రాణాలను కాపాడటం లక్ష్యంగా చర్యలు తీసుకోవడం వల్ల ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. మానవ తప్పిదాలు సహజం. కానీ దానివల్ల ప్రాణ నష్టం కలగకూడదు. అందుకోసం పట్టణ ప్రాంతాలలో గరిష్ట వేగం 30-50 కి తగ్గించారు. రోడ్లు సమతుల్యంగా ఉండేటలా అవసరమైన చోట్ల డివైడర్లు బ్యారియర్స్ నిర్మించారు. పాదచారులకు, సైకిల్ వాడే వారికి వేరు,వేరు మార్గాల ఏర్పాటు చేశారు. ప్రమాద డేటా విశ్లేషణ ఆధారంగా జీరో ప్రమాద రేటు వైపు అడుగులు వేస్తున్నారు.

2)చైనా: మనతోపాటు కొంచెం అటు ఇటుగా జనాభా ఉండే చైనాలో 2000 సంవత్సరం కంటే ముందు ఎక్కువ రోడ్డు ప్రమాదాలు, మరణాలు జరుగుతుండేవి. ప్రమాదాల నివారణపై ప్రభుత్వం కేంద్రీకరించింది. మౌలిక సదుపాయాలను మెరుగుపరచి ప్రజలందరికీ రోడ్డు అవగాహన కల్పించి, చట్ట నిబంధనలను సక్రమంగా అమలు చేసిన కారణంగా 20 సంవత్సరాల కాలంలో ప్రమాదాలు గణనీయంగా తగ్గాయి. పెద్ద నగరాలలో రాత్రింబవళ్లు పర్యవేక్షణ పెట్టారు. ఏఐ ఆధారిత కెమెరాలతో వేగము, తప్పుడు లైన్లు, సిగ్నల్ ఉల్లంఘనలను ఆటోమేటిగ్గా గుర్తిస్తున్నారు.

3) ఆస్ట్రేలియా: ప్రమాదాలు జరిగే బ్లాక్ స్పాట్ లపై కేంద్రీకరించి అవసరమైన భద్రతా చర్యలు తీసుకోవడం ద్వారా ప్రమాదాలను తగ్గించారు.

4)జపాన్‌లో రోడ్డు, వాహనాల నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టం, లైన్ అసిస్టెంట్ సిస్టం ను పగడ్బందీగా అమలు చేసి ప్రమాదాలను, మరణాలను కనిష్ట స్థాయికి తీసుకొని వచ్చారు.

పనిగంటలు, వేతనాలు, సామాజిక సంక్షేమం: యునైటెడ్ కింగ్డమ్ లో వాణిజ్య వాహన డ్రైవర్ ఎన్ని గంటలు వాహనాన్ని నడిపింది కౌన్సిల్ (ప్రభుత్వ) పర్యవేక్షణ జరుగుతుంది. ప్రతి డ్రైవరు విధిగా ఐదు గంటల డ్రైవింగ్ తర్వాత విరామం తీసుకోవాలి. యుకె, యూరోప్ లలో జాతీయ రహదారులలో ప్రతి 50 కిలోమీటర్ల దూరంలో వాహనాల పార్కింగ్కు విశ్రాంతి, మరియు రిలాక్సేషన్ కోసం విధిగా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. జాతీయ రహదారులు పొడవునా డ్రైవర్లకు "మీరు అలసిపోయి ఉంటారు. విశ్రాంతి తీసుకోండి" అని పెద్ద, పెద్ద సైన్ బోర్డులు అమర్చబడి ఉన్నాయి.

వేతనాలు: ప్రపంచంలోని చాలా దేశాల్లో గంటకు ఇంత పద్ధతి లో వేతనం లెక్కించి కనీస సౌకర్యాలు తీరే విధంగా వేతనాలు చెల్లిస్తున్నారు. ప్రభుత్వాలే ప్రతి సంవత్సరం ధరల పెరుగుదల పరిగణన లోకి తీసుకొని వేతనాలు పెంచుతున్నాయి.

"ఫెన్షన్: కార్మికుల వార్షిక ఆదాయాల ఆధారంగా పెన్షన్ ను యూకే ప్రభుత్వం గ్యారెంటీ చేసింది. మన దేశంలో? మోటార్ ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ చట్ట 1961 నిబంధనలు అమలు పై కార్మిక శాఖ గాని ప్రభుత్వ ఏ ఇతర శాఖ గాని పట్టించుకున్న దాఖలాలు లేవు. జాతీయ రహదారులలో డ్రైవర్లకు విశ్రాంతికి, కాలకృత్యాలకు, టీ, టిఫిన్, భోజన అవసరాలు తీర్చుకోవడానికి తగిన ఏర్పాట్లుఎక్కడా లేవు. అసంఘటిత రవాణా రంగ కార్మికులకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక సంక్షేమ పథకాలు ఏవి లేవు.

జాగ్రత్త: వాణిజ్య సరుకుల వాహనాల డ్రైవర్లపై తీవ్రమైన ఒత్తిడి ఉంటుంది. ఉదాహరణకు విజయవాడలో రాత్రి 10 గంటలకు బయలుదేరిన కూరగాయల లారీ ఉదయం ఐదు గంటలకు చెన్నై చేరుకోవాలి. తెల్లవారితే చెన్నై నగరంలోకి ప్రవేశం ఉండదు. మార్కెట్ చేరుకోవడం కష్టమవుతుంది. కాబట్టి నిర్ణీత గంటల వ్యవధిలోనే లారీ చెన్నై చేరుకోవాల్సిందే. డ్రైవర్లపై తీవ్రమైన మానసిక ఒత్తిడి పెరుగుతుంది. పై కారణాలన్నీ మనదేశంలో డ్రైవర్ల మానసిక శారీరక పరిస్థితులపై తీవ్ర ప్రభావం కలుగజేస్తున్నాయి. ఇవి కూడా ఎంతో కొంత ప్రమాదాలకి కారణభూతం అవుతున్నాయి ఇది కూడా ప్రభుత్వ వైఫల్యమే తప్ప వేరు కాదు.

ముగింపు:

1) ఇన్ఫ్రాస్ట్రక్చర్: రోడ్డు నిర్మాణ మౌలిక సదుపాయాల కల్పన. **2)** ప్రజలు, వాహనదారులు, రోడ్డు వినియోగదారుల్లో రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించాలి. రోడ్డు భద్రత అవగాహన పాఠశాల నుంచి కళాశాల స్థాయి వరకు వివిధ పాఠ్యాంశాలలో చేర్చాలి.

3)ఎన్ఫోర్స్మెంట్: చట్టం నిబంధనల అతిక్రమించిన సంస్థలు యాజమాన్యాలను కఠినంగా శిక్షించాలి. మౌలికమైన పై అంశాల పై ప్రభుత్వం తక్షణం చర్యలు ప్రారంభించాలి. అందుకు భిన్నంగా ప్రమాదాలకు సాంకేతిక అంశాలు, డ్రైవర్లు, ప్రజలదే బాధ్యత అని నేరారోపణ చేస్తూ ప్రభుత్వ బాధ్యతను విస్మరించే చర్యలు తక్షణం మానుకోవాలి.

మాయమై పోయాడమ్మా మన అందెశ్రీ



ప్రజాకవి, వాగ్గేయకారుడు డాక్టర్ అందెశ్రీ నవంబర్ 10న గుండె పోటుతో మరణించారు. 18 జూలై 1961న ఇప్పటి సిద్ధిపేట జిల్లా రేబర్తి గ్రామంలో జన్మించారు. ఆయన అసలు పేరు అందె ఎల్లయ్య. చిన్ననాటి నుండి కష్టాలు, కన్నీళ్ల మధ్య ఆయన పెరిగారు. అందువల్ల ఆయన పాఠశాలకు కూడా పోలేదు. గొర్రెల కాపరిగా, భవన నిర్మాణ కార్మికుడిగా ఆయన శ్రమదేవత ఒడిలోనే పెరిగారు.

'మాయమై పోతున్నడమ్మా' అంటూ కోల్పోతున్న మానవీయ విలువలపై అందెశ్రీ రాసిన గేయం అపారమైన ఖ్యాతిని తెచ్చిపెట్టింది తెలంగాణ ఉద్యమ కాలంలో ఆయన తన పాటలు, మాటల ద్వారా చురుకైన పాత్ర పోషించాడు. అందెశ్రీ రాసిన "జయ, జయహే తెలంగాణా" పాటను రాష్ట్ర ప్రభుత్వం, మన రాష్ట్ర గీతంగా ప్రకటించింది. 2006 లో "గంగ" సినిమా కోసం ఆయన రాసిన పాటకు నంది అవార్డు లభించింది. 2014లో అకాడమీ అఫ్ గ్లోబల్ పీస్ డాక్టరేటు, 2015 లో రావూరి భరద్వాజ సాహితీ పురస్కారం, 2014లో దాశరథి కృష్ణమాచార్య సాహితీ పూరస్కారాలు ఆయన్ను వరించాయి.

ప్రజాకవి అందెశ్రీకి ఆర్టీసీ కార్మికుడు జోహార్లు సమర్పిస్తున్నది.

ఎస్‌డబ్ల్యూఎఫ్ కరీంనగర్ జోనల్ కమిటి

వరంగల్‌లోని సి.ఐ.టి.యు కార్యాలయంలో అక్టోబర్ 8న జోనల్ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఎస్‌డబ్ల్యూఎఫ్ సీనియర్ నాయకులు రాంచందర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వీరాంజనేయులు, వి.ఎస్.రావు, ప్రచార కార్యదర్శి పి.రవిందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఇంకా రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జాకబ్ పాల్గొన్నారు. ఈ జనరల్ బాడీలో కరీంనగర్ జోనల్ కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.





కరీంనగర్ జోనల్ కమిటీ

జోనల్ అధ్యక్షులు : రాంచందర్. **ఉపాధ్యక్షులు :** మల్లయ్య

కార్యదర్శి : జి. లింగమూర్తి. **సహయకార్యదర్శి :** ఎం. రాజయ్య

కోశాధికారి : శ్రీనివాసులు

ఈ జనరల్ బాడీ సమావేశంలో వరంగల్ రీజియన్ అధ్యక్ష, కార్యదర్శులు : ఎల్లయ్య, ఉపేంద్రాచారి, కరీంనగర్ రీజియన్ అధ్యక్ష కార్యదర్శులు రాపెల్లి రాజయ్య, వి.శ్రీనివాస్ తదితరులు పొల్గొన్నారు.

ప్రశ్నలు - జవాబులు



పి.రవీందర్‌రెడ్డి
SWF రాష్ట్ర ప్రచార కార్యదర్శి

ప్రశ్న : ప్రయాణీకుల ఫిర్యాదులు ట్విట్టర్, వాట్సప్‌లలో వచ్చిన వాటిపై తగు విచారణ చేపట్టకుండానే డ్రైవర్, కండక్టర్లను భయభ్రాంతులకు గురిచేసి యాజమాన్యాలు పనిష్మెంట్లు ఇస్తున్నారు. ఇది అన్యాయం కాదా? డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత ఎందుకు లేదు?

– జంగయ్య, కండక్టర్, ఇబ్రహీంపట్నం డిపో

జవాబు: ప్రయాణీకుల ట్విట్టర్, వాట్సప్ ఫిర్యాదులపై ఏకపక్షంగా డ్రైవర్, కండక్టర్లపై యాజమాన్యాలు పనిష్మెంట్లు ఇవ్వడం అన్యాయమే. ఆర్టీసీ యాజమాన్యం ఫిర్యాదు చేసిన ప్రయాణీకుడిని, తగు సాక్ష్యాధారాలను డిపోలో కార్మికుడి సమక్షంలో విచారణ జరపాలి. ఋజువు అయితేనే తగు పనిష్మెంటు ఇవ్వాలి. అంతేకాని చీటికి, మాటికి పనిష్మెంట్లతో కార్మికులను భయభ్రాంతులకు గురి చేయవద్దు. వారి పనిలో నాణ్యత లోపిస్తుందని హెచ్.ఆర్. విభాగము మేధావులు చెబుతున్న అంశం. భారత చట్టం ప్రకారం ఎవరి మీదనైతే పోలీసులు నేరారోపణ చేస్తారో పోలీసులే నేరాన్ని నిరూపించాల్సి వుంటుంది. కానీ ఆర్టీసీలో మాత్రం నేరారోపణకు గురైన వారే, నేరం చేయలేదని నిరూపించుకోవాల్సి వుంటుంది. ఇది సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమైనది. ఆర్టీసీలో ఈ విధానము మారాఇ.

ఇక మీరు అడిగిన రెండవ ప్రశ్న డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత ఎందుకు లేదో వివరిస్తాను.

ఆర్టీసీలో ఎస్‌డబ్ల్యూఎఫ్ 1979 సెప్టెంబర్ 16న ఆవిర్భవించింది. డ్రైవర్, కండక్టర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్న డిమాండ్‌పై కార్మికులు 1980 నుండి అనేక ఆందోళనలు, పోరాటాలు చేస్తున్నారు. ఉద్యోగ భద్రతకు ఆటంకంగా వున్న ఆర్టీసీ రెగ్యులేషన్స్ సవరించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ సభలు సమావేశాలు పెట్టి కార్మికులను చైతన్యం చేసింది. యాజమాన్యానికి పలు విన్నపాలు చేసింది. భారత దేశంలో ఏ సంస్థలో అయినా నియమనిబంధనలు, రెగ్యులేషన్స్ అన్ని భారత రాజ్యాంగానికి, సహజ న్యాయ సూత్రాలకు కట్టుబడి ఉండాలి. కానీ ఆర్టీసీ రెగ్యులేషన్స్ వాటికి విరుద్ధంగా వున్నాయి. ఉద్యోగ భద్రతపై ఆర్టీసీ కార్మికులు చేసిన ప్రతి ఆందోళన, పోరాటాల సందర్భంగా కొన్ని మార్గదర్శకాలు, సర్క్యులర్స్ విడుదల చేసింది. కానీ ఉద్యోగ భద్రతకు ఆటంకంగా వున్న రెగ్యులేషన్స్‌ను సవరించలేదు. 2019లో ఆర్టీసీ కార్మికులు చేసిన 55 రోజుల చారిత్రాత్మకమైన సమ్మె అనంతరం, అప్పటి ముఖ్యమ్రంతి గారు డిసెంబర్ 1న జరిగిన ఆర్టీసీ కార్మికుల సమ్మేళనంలో 'ఉద్యోగ భద్రత' కల్పిస్తామనే ప్రకటనతో కార్మికులు ఎంతో ఆనందించారు. కాని 14 నెలల అనంతరం యాజమాన్యం విడుదల చేసిన ఉద్యోగ భద్రత మార్గదర్శకాలు లేఖ నం.టి1/535(16)/2019-ఓపిడి(టి) తేది: 05-02-2021లో ఉద్యోగ భద్రత పెనం నుంచి పొయ్యిలో పడ్డట్లయ్యిందని కార్మికులు భావించారు. దానిపైన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ అధ్యయనం చేసి ఉద్యోగ భద్రతకు ఆటంకంగా వున్న మార్గదర్శకాలను సమరించాలని అప్పటి ఆర్టీసీ ఛైర్మన్ గారికి తేది.29.04.2023 వినతి పత్రం అందజేసింది.

ప్రశ్న : ఇటీవల తనిఖీ అధికారులు, తనిఖీ సమయంలో బస్సులో ప్రయాణీకుల సంఖ్య కంటే, మహాలక్ష్మి టికెట్లు (జీరో ఫేర్ టికెట్లు) ఎక్కువగా వున్నాయిన కండక్టర్లకు మెమోలు ఇస్తున్నారు. డిపో స్పేర్‌లో పెట్టి పనిష్మెంట్లు కూడా ఇస్తున్నారు. మహిళలు కొంత మంది ముందుగానే దిగితే మా తప్పు ఎలా అవుతుంది. ఏమిటీ ఈ ఘోరం చెప్పండి? **– కె.గీత, కండక్టర్, జేడిమెట్ల డిపో**

జవాబు : ఆర్టీసీకి ఆదాయం కోల్పోకుండా వుండేలా చూడటం కోసం నియమించినది చెకింగ్ విధానము. కానీ గత పదుల సంవత్సరాలుగా డ్రైవర్ / కండక్టర్లు దొంగలు లాగా, ఆ దొంగలను కాపుకాసి పట్టుకునే వారిగా కొంతమంది టిటిఐలు వ్యవహరిస్తున్నారు. చెకింగ్ సమయంలో టిటిఐలు తీసుకోవాల్సిన నిబంధనలు ఉద్యోగ భద్రత గైడ్‌లైన్స్‌లో సరిగ్గా లేవు. అందులో భాగంగానే మీరు చెప్పినటువంటి కేసులను టిటిఐలు రాస్తున్నారు. యాజమాన్యం వారికి సరియైన గైడ్‌లైన్స్ ఇవ్వాలి. ఆ మేరకు చెకింగ్ స్క్వాడ్‌లో పనిచేసే టిటిఐలకు/ఇంఛార్జిలకు పీరియాడికల్‌గా సరియైన ట్రైనింగ్ ఇవ్వాలి. టిటిఐలపైన విధిస్తున్న ఇఐఫ్‌టి, ఎఫెక్టివ్ చెక్స్ పేరుతో ఇస్తున్న టార్గెట్స్‌ను ఎత్తివేయాలి. వారిపై ఎలాంటి ఒత్తిళ్లు ఉండరాదు. దీనిపైన ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కమిటీ తేది.29.4.2023న యాజమాన్యానికి వినతిపత్రం కూడా అందజేసింది.

ప్రశ్న : మహిళా ఉద్యోగులు హిస్టెరెక్టమీ/గర్భాశయ ఆపరేషన్ చేయించుకుంటే ఎన్ని రోజులు సెలవులు మంజూరు చేస్తారు?

– తుల్జయ్య, కండక్టర్, సంగారెడ్డి డిపో

జవాబు : మహిళా ఉద్యోగులు హిస్టెరెక్టమీ/ గర్భాశయ తొలగింపు ఆపరేషన్ చేయించుకుంటే గరిష్టంగా 30 రోజులు స్పెషల్ లీవ్‌లు మంజూరు చేస్తారు. ఆపరేషన్ చేయించుకున్న మెడికల్ రిపోర్టును తార్నాక ఆర్టీసీ ఆసుపత్రి సూపరిండెంట్ సర్టిఫై చేయాల్సి ఉంటుంది. అట్టి లీవ్‌లను రెగ్యులర్ లీవ్ బ్యాలెన్స్ నుండి తొలగించరు. దానికి పూర్తి వేతనము మరియు అలవెన్స్‌లు చెల్లిస్తారని సర్క్యులర్ నం. పిడి-26/2015 తేది.25-7-2015లో తెలిపారు.

మూర్తి @ 996



వీరాంజనేయులు
SWF రాష్ట్ర అధ్యక్షులు

మూర్తి గారు ఆఫీసు నుండి ఇంటికి వచ్చారు. మూర్తిగారి పూర్తి పేరు సత్యనారాయణ మూర్తి. ఆయనకు ఇన్ఫోసిస్ నారాయణ మూర్తిగారు అంటే ఎనలేని గౌరవం. సరిగ్గా చెప్పాలంటే ఆ మూర్తి గారు ఈ మూర్తి గారికి స్ఫూర్తి. ఆ మూర్తిగారి వల్ల, ఆయన ప్రారంభించిన ఇన్ఫోసిస్ కంపెనీ వల్ల భారతదేశం టెక్నికల్‌గా ఎంతో ముందడుగు వేసిందని ఈ మూర్తి గారు బలంగా నమ్ముతారు. ఆ మూర్తి గారు పలికే ప్రతి వాక్యం వేద వాక్యంలా భావిస్తారు.

గతంలో ఇన్ఫోసిస్ మూర్తిగారు 70 గంటల పనిదినం ఉండాలని ప్రకటించినప్పుడు ఈ మూర్తిగారు ఎంతో ఆనందపడ్డారు. బద్దకస్తులు ఉన్న భారతదేశంలో పని సంస్కృతిని పెంచటానికి 70 గంటల పనిదినం ఎంతగానే తోడ్పడుతుందని ఆశపడ్డారు. ఇప్పుడు తాజాగా 72 గంటల పనిదినం ఉండాలని, 996 ఫార్ములా ఉండాలని చెప్పినపుడు ఎంతో ఉత్సాహపడ్డాడు. పడుకునే ముందు ఒక నిర్ణయానికి వచ్చాడు! హాయిగా నిద్రపోయాడు.

పొద్దున్నే అన్ని సిద్ధం చేసుకుని 10 గంటలకు ఆఫీసులోకి అడుగుపెట్టాడు! ఇంకా ఎవరూ రాలేదు! తన ఛాంబర్‌లోకి వెళ్ళి బెల్ కొట్టాడు. అటెండర్ వచ్చాడు. అతనికి ఏదో చెప్పాడు.

మరో 5 నిబబల్లో అందరూ తమ బాస్ మూర్తి గారి ఛాంబర్‌లోకి వచ్చాడు.

"మీకు ఎవ్వరికీ బాధ్యత లేదు! పని సంస్కృతి తెలియదు. దేశం గురించి ఎవరికీ పట్టింపు లేదు! 8 గంటల పనిదినం వల్ల దేశం సర్వనాశనం అయ్యింది. ఇప్పటికైనా మనం మారుదాం! మార్పు నాతోనే మొదలు పడదాము!"

"మార్పు ఎలా మొదలు పెడతారు సార్! ఉత్సాహంగా అడిగాడు చారి! అతడు ఈ మధ్యలోనే ఆఫీసులో ఉద్యోగంలోకి వచ్చాడు. కుర్రాడు చక్కగా పనిచేస్తాడని అందరూ మెచ్చుకుంటారు! మిగతావారు రెండు గంటల్లో చేసే పని చారి ఒక్క గంటలోనే చేస్తాడు.

"ఇన్ఫోసిస్ మూర్తి గారు, వారానికి 72 గంటల పని, 996 ఫార్ములా గురించి చెప్పారు! దాన్ని ఈ రోజే మన ఆఫీసులో అమలులోకి తెస్తున్నాం. మూర్తి గారు మనందరికి స్ఫూర్తి! అందుకే ఆయన ఫొటోలు మీ ఫోన్లలో, కంప్యూటర్లలో హోమ్ స్క్రీన్‌గా పెట్టుకోండి. ఆఫీసులో గోడ గడియారం లేపేశాం! మీ ఫోన్లలో మాత్రమే టైము చూసుకోవాలి!" అన్నారు మూర్తి గారు.

"ఈయనో పెద్ద రజనీకాంత్! ఆ మూర్తి శాపించాడు! ఈ మూర్తి పాటిస్తాడు" అని గొణిగాడు అటెండర్.

"996 ఫార్ములా ఎలా అమలు చేయాలో నేను చూపిస్తాను. మన చారి సీటులో నేను పని చేసి చూపిస్తాను! రేపట్నించి మీరంతా నేను ఎలా పని చేశానో, అదేవిధంగా మీరు పని చేయాలి! ఈ రోజు వరకు మీరు పాత పద్ధతిలో పని చేస్తూ, నన్ను పరిశీలించండి! ఓకేనా?" అన్నారు మూర్తిగారు!

మిగిలిన వారు బదులిచ్చేలోపే చారి, "సార్ నన్ను ఉద్యోగం నుండి తీసేయకండి సార్! నాకు చాలా బాధ్యతలున్నాయి! నాకు పెళ్ళి కాలేదు! ఇంకా ఇద్దరు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయాలి!" అంటూ వచ్చి మూర్తి గారి కాళ్ళు పట్టుకున్నాడు.

భయపడకు! చారీ, నేను నీ స్థానంలో పని చేస్తే, నీ ఉద్యోగం పోదు! నీవు నా స్థానంలో ఈ ఆఫీసుకు బాస్‌గా పని చేయి! ఈ ఒక్క రోజే సుమా!" అన్నారు మూర్తిగారు నవ్వుతూ.

చారి కుదుట పడ్డాడు.

"లెట్ అజ్ స్టార్ట్!" అన్నారు మూర్తి.

అందరూ ఎవరి సీట్లలోకి వాళ్ళ వెళ్ళిపోయారు! మూర్తి గారు కూడా యధావిధిగా తన ఛాంబర్‌లోకి వెళ్ళబోయి నిబంధన గుర్తొచ్చి, చారి సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు. ఆయన సీట్లో కూర్చోగానే, అది ఓ పక్కకి ఒరిగి పోయింది! దాన్ని ఆక్కడా, ఇక్కడా కదిలించి చూశాడు. ఏం చేసినా సీటు సరికాలేదు! కొత్త పని సంస్కృతిని ప్రారంభించటానికి, ఒరిగిపోయిన సీటు అడ్డుకాదనుకున్నారు! పని ప్రారంభించారు. కాసేపటికి మంచి నీళ్ళు తాగాలన్పించింది! అటూ ఇటూ చూశారు! నీళ్ళు ఆ మూలకి క్యాన్‌లో ఉన్నాయి! అటెండర్‌ని పిలవటానికి బెల్ కొట్టబోయాడు బెల్ లేదు!

"రాజా" అంటూ అటెండర్‌ని పిలిచాడు. రాజు బాస్ ఛాంబర్ వద్ద స్టూల్ మీద కూర్చుని ఉన్నాడు.

"ఏంటి సార్ !' అన్నాడు రాజు అక్కడి నుండే.

"మంచినీళ్ళు కావాలి!" అన్నారు మూర్తి గారు.

"ఆ మూలకి ఉన్నాయి! వెళ్ళి తాగండి! అయినా మీ బాటిల్ మీరు తెచ్చుకోవచ్చు గద సార్ !" అన్నాడు రాజు చిరాగ్గా.

"మూర్తిగారు మాట్లాడకుండా వెళ్ళి నీళ్ళు తాగి వచ్చి పని ప్రారంభించారు. కాసేపటికి బాత్రూంకి వెళ్ళాలన్పించింది! బాత్రూంకి వెళ్ళాడు! బయటకి వచ్చి చూస్తే బయట రాజు నిలబడ్డాడు.

"సార్! మీరు బాత్రూంలో 10 నిబబలు గడిపారు! ఆ టైము మీరు అదనంగా పని చేయాల్సి ఉంటుందని బాస్ చెప్పారు!" అన్నాడు రాజు.

మూర్తిగారికి ఎంతో సంతోషమయ్యింది! పని సంస్కృతి అంటే ఏమిటో ముందు బాస్‌కి అర్థమయ్యిందన్న మాట! అనుకుంటూ తన సీటు వద్దకి వచ్చేసరికి తన టేబుల్‌పైన పదికి పైగా ఫైళ్ళు ఉన్నాయి! మూర్తిగారికి ఉత్సాహం వచ్చింది. వాటిని వెంటనే పూర్తి చేసి పని సంస్కృతి అంటే ఏమిటో మిగిలిన సిబ్బందికి తెలియచేయాలని అనుకున్నాడు. గంటసేపు పని చేసి ఫైళ్ళు క్లియర్ చేశాడు. అలసిపోయినట్లన్పించి టీ తాగుదామని లేచాడు!

"ఏమిటి మూర్తిగారు లేచారు!" అంటూ వచ్చాడు చారి అలియాస్ బాస్.

"టీ తాగి వస్తాను!" అన్నారు మూర్తి గారు,

"పని సంస్కృతితో పాటు, సభ్యత నేర్చుకోండి. మీ వాక్యాలకి ముందూ చివరా సర్ అని చేర్చండి!" అంటూ

చారి. ఛాంబర్‌లోకి వెళ్ళాడు.

వెంటనే రాజు వచ్చి పేపర్ కప్పులో టీ తీసుకొచ్చి మూర్తిగారి టేబుల్ మీద పెట్టి "టీ తాగటానికి బయటకి వెళ్ళద్దన్నారు బాస్! టీ తాగుతూనే పని చేయాలన్నారు!" అంటూ వెళ్ళాడు.

చేసేది లేక మూర్తిగారు పని ప్రారంభించారు! ఇంతలో మరో 20 ఫైళ్ళు తీసుకొచ్చి టేబుల్ మీద పెట్టాడు రాజు, వాటిని చూడగానే మూర్తి గారికి చిరాకు కలిగింది! కాని పని సంస్కృతి గుర్తుకొచ్చింది! ఫోన్‌లో ఇన్‌ఫోసిస్ నారాయణమూర్తి ఫోటో చూసుకొని పని మొదలుపెట్టాడు. అది పూర్తి కానే లేదు! మరో 20 ఫైళ్ళు వచ్చాయి. వాటిని చూడగానే కోపం వచ్చింది! ఫైళ్ళు విసిరికొట్టబోయాడు. కాని తమాయించుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. తాను గమనించలేదు కాని భోజనం చేసే టైమయ్యింది! ఫైళ్ళు పక్కకి పెట్టి భోజనానికి లేవబోయాడు. రాజు చిన్న బాక్సు తెచ్చి మూర్తిగారికి ఇచ్చాడు.

"ఈ భోజనం ఇక్కడే తిని, 10 నిబబల్లో పని ప్రారంభించమన్నారు బాస్!" అంటూ వెళ్ళబోయాడు రాజు.

మూర్తి గారు రాజుని ఆపి తెరిచిన బాక్స్ చూపారు! అందులో ఒక కప్పులో రైస్, మరో కప్పులో సాంబార్ ఉంది!

"ఇది భోజనమా! కనీసం ఒక కర్రీ కూడా లేదు!" అన్నారు మూర్తిగారు అసహనంగా.

"ఇదే భోజనం. ఇంతే ఉంటుంది! రైస్ క్వాంటిటీ పెంచి, కర్రీలు చెట్నీలు పెడితే తినటానికే గంట టైం పడుతుంది. అందుకే సాంబర్ తెప్పించారు, గొంతులో జారిపోతుంది!" కానివ్వండి, టైం వేస్ట్ చేయకండి!" అంటూ వెళ్ళి పోయాడు.

మూర్తిగారికి ఏం చెప్పాలో తెలియలేదు! మారు మాట్లాడకుండా తినేశాడు. అంతలోనే బాస్ వచ్చాడు.

"మీ పక్క సీటులోని వనజ గారి నాన్నగారికి ఆరోగ్యం బాగా లేదు! ఆవిడకి హాఫ్ డే లీవు ఇస్తున్నాను. ఆవిడ సీటు వర్క్ మీకు అప్పగిస్తున్నాను. కంప్లీట్ చేయండి!' అని బాస్ అంటూండగానే రాజు వచ్చి, ఆమె టేబుల్ మీదున్న 50 ఫైళ్ళు మూర్తిగారి టేబుల్ మీద పెట్టాడు! వాటిని చూడగానే మూర్తిగారి కళ్ళు తిరిగారు.

"ఆవిడ పని నేనెందుకు చేస్తాను సర్ !" అన్నారు మూర్తిగారు. బాస్ నవ్వాడు.

"మూర్తిగారు, ఇప్పటికే మీకు సగం రోజు రిలీఫ్ ఇచ్చాను. 9-9-6 ఫార్ములా ప్రకారం పది మంది పనిచేసే చోట ఐదు మంది సరిపోతారు! కనక వనజ గారి పూర్తి పని ఈ రోజు మీరే చేయాలి. కాని మీరు చెప్పిన పని సంస్కృతి ఆమెకూ అర్థం కావాలి అని మధ్యాహ్నం వెళ్ళమన్నాను. ఐనా మీరేమైనా రాళ్ళు కొడుతున్నారా? మూటలు మోస్తున్నారా? గంటలో మొత్తం ఫైళ్ళు నా ముందుండాలి!" అంటూ వెళ్ళిపోయాడు.

మొదటిసారి 9-9-6- పని సంస్కృతి మీద కోపం వచ్చింది. కాని అది గొప్ప సిద్ధాంతం. దేశానికి ఉపయోగపడే సిద్ధాంతం! పనిని కంటిన్యూ చేశాడు. కాసేపటికి లేచి బాత్‌రూముకి వెళ్ళాడు. అక్కడ రాజు ఉన్నాడు.

"సార్! ఇప్పటికి మీరు ఐదుసార్లు వచ్చారు! వచ్చిన ప్రతిసారి 10 నిబబ గడుపుతున్నారు. ఈ ఒక్కసారికే పర్మిషన్ ఇచ్చారు! దీంతో కలిపి గంట అవుతుంది! దీంతో మొత్తం ఈ రోజు 10 గంటలు పని చేయాల్సి ఉంటుంది!" అన్నాడు రాజు.

బాత్రూంకి వెళ్ళేటం మానేసి, నేరుగా బాస్ ఛాంబర్‌కి వెళ్ళారు మూర్తి గారు!

"ఇదేంటి సర్! బాత్రూంకి వెళ్తే కూడా టైము లెక్కపెడతారా? మధ్యాహ్నం భోజనానికి టైము ఇవ్వలేదు! పక్క సీటు వనజ పని కూడా నాకే చెబుతారా? మీ మీద యూనియన్‌కి లేబర్ డిపార్టుమెంటుకి ఫిర్యాదు చేస్తాను!" అన్నారు మూర్తి గారు అప్రయత్నంగా.

"ఏమని ఫిర్యాదు చేస్తారు ?" అడిగాడు బాస్.

"8 గంటల పని దినం అమలు చేయాలని!' అన్నారు మూర్తి గారు.

బాస్ పెద్దగా నవ్వారు! అప్పటికే అక్కడికొచ్చిన మిగిలిన స్టాఫ్ కూడా ముసిముసిగా నవ్వారు.

"9-9-6 చెప్పటానికి బాగుంటుంది సర్! కాని తానే అమలు చేస్తేనే అసలు సంగతి అర్థమవుతుంది! మీరింకా పూర్తి పని దినం చేయలేదు! అపుడే మీరు తిరుగుబాటు ప్రకటించారు! మీ పని అంతా ఆఫీసులోనే చేస్తున్నారు! ఒక ఫ్యాక్టరీలోనో ఒక బగ్గు గనిలోనో ఒక ఆర్టీసీ బస్సులోనో పనిచేస్తే మీరు ఏం చేసేవారో? ఇప్పటికే తక్కువ జీతాలతో, బతుకుతున్నవారి జీవితాలు ఎలా ఉంటాయో మీకు తెలుసా? అలా బతకగలరా? కనీసం అలాంటి బతుకుని ఊహించగలరా? 8-8-8 ఫార్ములాని అన్నీ ఆలోచించే చట్టం చేశారని తెలుసుకోండి!" అంటూ బాస్ సీట్లో నుండి లేచి వచ్చాడుచారి! మూర్తిగారు తలదించుకున్నారు.

చదవండి! చదివించండి!

మన వర్కర్

ఈ పి ఎస్ 95 కనీస పెన్షన్ పెయింపుదల-ప్రభుత్వ వైఖరి -పెన్షన్ పూర్వాపరాలు

2013 సంవత్సరంలో కాంగ్రెస్ నేతృత్వం లోని యునైటెడ్ ప్రోగ్రెసివ్ అలయెన్స్ ప్రభుత్వం కనీస పెన్షన్ ను రూ 1000/ కి పెంచాలని నిర్ణయించింది. కానీ అమలు చేయలేదు.2014 లో నరేంద్ర మోడీ గారి నేతృత్వంలో వచ్చిన యెన్.డి.ఏ. ప్రభుత్వం దానిని అమలు జేసింది.(అయితే నేటికి ఇంకా అనేక మందికి వెయ్యి లోపే పెన్షన్ వస్తున్నది) నాటినుండి నేటికీ అన్ని సరుకుల, సేవల ధరలు అనూహ్యంగా పెరిగాయి. కాబట్టి కనీస పెన్షన్ ను 9,000/ లకు పెంచాలని ఉద్యోగ విరమణ చేసిన ఈ.పి.ఎస్ పెన్షన్ దారులు, అన్ని కార్మిక సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. వాస్తవానికి సొంత ఇల్లు ఉన్న భార్య, భర్త బ్రతకడానికి రూ.9000/ ఏమాత్రం సరిపోదు. అయినా దీని చుట్టూ అనేక కథనాలు,ఊహాగానాలు, తప్పుడు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ.పి.ఎస్ పెన్షన్ గురించి తెలుసుకుందాం.

ఈ.పి.ఎస్. పూర్వ రంగం : పారిశ్రామిక కార్మికులకు పి ఎఫ్, గ్రాట్యుటీ తో పాటు మూడవ బెనిఫిట్ గా పెన్షన్ కావాలని కార్మిక వర్గం, సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. 1990 లలో సోవియెట్ యూనియన్ మరియు తూర్పు యూరప్ లోని దేశాలలో సోషలిస్ట్ వ్యవస్థలు కుప్పగూలిపోయి అమెరికా ఆదేశిత ఏక ధ్రువ ప్రపంచం ఏర్పడిందని, ప్రపంచికరణే ప్రగతికి మార్గమని అనేక దేశాలు పల్లవి ఎత్తుకున్నాయి. అందుకనుగుణంగా నిర్ణయాలు జరుగుతున్న నేపథ్యంలో 1994 లో మనదేశంలో పి.వి.నరసింహా రావు గారు ప్రధానిగా, డాక్టర్ మన్మోహన్ సింగ్ గారు ఆర్థిక మంత్రిగా అధికారంలోకి వచ్చారు. ప్రపంచీకరణలో కీలకమైన అంశం ప్రభుత్వం ప్రజల పట్ల తనకున్న బాధ్యత నుండి తప్పుకొని మార్కెట్ శక్తుల దయ, దాక్షిణ్యాలకు ప్రజలను వదిలివేయడం. ఈ నేపథ్యం లో వచ్చిందే ఈ.పి.ఎస్. 1995. అంటే కార్మికులు తమ పి.ఎఫ్. నిధులలో 8.33% పెన్షన్ నిధికి చెల్లించి దాని నుండి పెన్షన్ కొనుక్కోవడం. కాబట్టి ఇప్పుడు పొందుతున్న పెన్షన్ కార్మికులు తమ కష్టార్జితం నుండి జమ చేసిన మొత్తం నుండి కొనుక్కుంటున్నది తప్ప ఇది దయా ధర్మం కాదు. దీన్ని ముందు అర్థం చేసికోవాలి.

ఈ దగాకోరు పెన్షన్ పథకం కి వ్యతిరేకంగా సి.ఐ.టీ.యు ఒక రోజు దేశవ్యాపిత సమ్మెకు పిలుపు నిచ్చింది. సీ.ఐ.టీ.యూ తో పాటు ఇతర సంఘాల కార్మికులు కూడా ఆ సమ్మెలో పాల్గొన్నారు. దగాకోరు పెన్షన్ పథకాన్ని సవాలు చేస్తూ కోర్టులలో కేసులు వేశారు. చివరకు సుప్రీమ్ కోర్టుకు వెళ్లింది. "ఇది ప్రారంభమని, ప్రతి సంవత్సరం పథకాన్ని సమీక్షించి మెరుగు పరుస్తామని" కేంద్ర ప్రభుత్వం సుప్రీమ్ కోర్టుకు చెప్పడంతో సుప్రీంకోర్టు ఆ కేసు కొట్టివేసింది. కోర్టుకు ఇచ్చిన హామీని ప్రభుత్వం సమాధి చేసింది. కొండ నాలుకకు మందు వేస్తే ఉన్న నాలుక పోయిన చందంగా నాడు కార్మికులకు అనుకూలంగా ఉన్న కొన్నిటిని నేటి నరేంద్ర మోదీ ప్రభుత్వం 2014 లో రద్దు చేసింది.



ఆర్.లక్ష్మయ్య
AIRTWF ఉపాధ్యక్షులు

నేడు ఈ.పి.ఎస్. పెన్షనర్లు ఎంతమంది ఉన్నారు? వారు పొందుతున్న పెన్షన్ యెంత?

భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) నుండి రాజ్య సభకు ఎన్నికైన పార్లమెంటు సభ్యులు జాన్ బ్రిట్టాస్ గారు అడిగిన ప్రశ్నకు కార్మిక మంత్రిత్వ శాఖ వ్రాతపూర్వకంగా జవాబు ఇచ్చింది. అందులో ని వివరాలు చుస్తే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. 2025 మార్చి 31 నాటికి ఈ.పి.ఎస్ కింద పెన్షన్ పొందుతున్న వారి సంఖ్య 81,48,490(ఎనభై ఒక్క లక్షల నలభైయెనిమిది వేల నాలుగు వందల తొంభై) మంది. ఇందులో నెలకు రూ. 1500/ ల లోపు పెన్షన్ పొందుతున్న వారు 49,15,416(నలభైతొమ్మిది లక్షల పదిహేను వేల నాలుగువందల పదహారు).అంటే సుమారు అరవై శాతం మంది కేవలం రూ 1500/- లోపు మాత్రమే పెన్షన్ తీసుకుంటున్నారు.

రూ.1501/ నుండి నాలుగు వేల లోపు తీసికొనే వారి సంఖ్య 30,54,144(ముప్పై లక్షల యాభైనాలుగు వేల నూటనలభై నాలుగు). రూ.4001/(నాలుగువేల ఒకటి) నుండి 6000/ లోపు పెన్షన్ పొందుతున్న వారి సంఖ్య 1,25,389(ఒక లక్ష ఇరవై ఐదు వేల మూడు వందల ఎనభై తొమ్మిది). అంటే ఒక్కరంటే ఒక్కరు కూడా నెలకు ఆరు వేలకు మించి పెన్షన్ పొందుతున్న వారు లేరు. వీరిలో ఉన్నత చదువులు చదివి వివిధ హోదాలలో ఉద్యోగ విరమణ చేసిన అధికారులు కూడా ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం అత్యంత నీచంగా నిర్ణయించిన రోజు కూలి(ఎలాంటి నైపుణ్యం లేని వారికి) రోజుకు రూ.178/ అంటే నెలకు 5,340 రూపాయలు. అంటే నైపుణ్యంలేని ఒక కార్మికుడు నెలకు సంపాదించే కూలితో సమానం అన్న మాట. ఇది 25 ఆ పైన సంవత్సరాలు కష్టపడి సేవ చేసి, సంపద సృష్టించి,ప్రభుత్వం దగ్గర పి.ఎఫ్. నిధిని దాచి పెట్టి కొనుక్కుంటున్న పెన్షన్.

పెన్షన్ పై సుప్రీమ్ కొర్టు ఏమి చెప్పింది?

భారత దేశ అత్యున్నత న్యాయస్థానం 1982 డిసెంబర్ 17 న చారిత్రాత్మకమైన తీర్పులో పెన్షన్ దాతృత్వం /బహుమానం కాదు- ఉద్యోగుల హక్కు అని తీర్పునిచ్చింది (%ఈ.ఐ.శ్రీబిదిబిజీబి ఇ ళిశినీలిజీరీ ఖీరీ తిదీరిళిదీ ళితీ ।దీఖిరిబి -1982 జుఃష్ట్ర , 1983 ఖ్పుష్ట్ర% (2)165). సుప్రీమ్ కోర్టు తీర్పు అంటే పార్లమెంట్ చట్టంతో సమమనమని గతంలో భావించేవారు. ప్రపంచీకరణ కాలంలో ఆ భావనకు కాలం చెల్లింది. పెన్షన్ మూడవ బెనిఫిట్ హక్కుగా కార్మికులు, సంఘాలు డిమాండ్ చేయండం అక్షరాలా కరెక్ట్ అని అత్యున్నత న్యాయస్థానం ధృవీకరించింది. అందుచేత పెన్షన్ ను హక్కుగా సాధించుకోవాలి కానీ ఎవరి దయ కోసమో ప్రాధేయపడటం కాదు అని గుర్తించాలి.

కనీస పెన్షన్ పెంపుదల : ప్రభుత్వ గణాంకాల ప్రకారమే ప్రతి సవంవత్సరం వినిమయ ధరల సూచి పెరుగుతున్నది. ఈ సూచీని ప్రభుత్వం లెక్కించే విధానం లోపభూయిష్టం మరియు మోసపూరితం. అయినా ఆ తప్పుడు లెక్కల ప్రకారమే 2014 నుండి ఇప్పటికి 78 పాయింట్లు పెరిగింది. మన నిత్య ఆనుభవంలో అందుకు ఇంకా చాలా ఎక్కువగా సరకుల, సేవల ధరలు పెరిగాయి. అందుచేత పెన్షన్ పెంచడం అనివార్యం.

కేంద్ర కార్మిక మంత్రిత్వ శాఖ నియమించిన హై లెవెల్ మానిటరింగ్ కమిటీ కనీస పెన్షన్ రూ.1000/ నుండి రూ.2000/ లకు పెంచాలని కేంద్ర ప్రభుత్వానికి 2022 లో సిఫారుసు చేసింది. ఆ సిఫారసును కార్మిక శాఖ ఆర్థి శాఖ ఆమోదానికి పంపింది. ఆర్థిక శాఖ దాన్ని తిరస్కరించింది. ఈ విషయాన్ని ఫిబ్రవరి -10 -2024 న జరిగిన 235 వ సి.బి.టి సమావేశం లో అధికారికంగా తెలియజేసారు.

నాడు, నేడు కూడా ఆర్థిక శాఖా మాత్యులు నిర్మలమ్మ గారే.

సి.బి.టి. సమావేశం: సిబిటి సమావేశం ఎప్పుడు, ఎక్కడ జరిగేది, అజండా ఏమిటి ముందుగానే నిర్ణయించబడుతుంది. అలాగే 238 వ సమావేశం 10-10-2025 న బెంగుళూరులో జరుగనున్నట్లుగా కార్మిక మంత్రిత్వ శాఖ తెలియజేసింది. అయితే 4-5 రోజుల ముందు బెంగుళూర్ కాకుండా ఢిల్లీకి, 10 కి బదులు 13 వ తేదీకి మార్చారు. 10వ తేదీ సిబిటి సమావేశం సందర్భంగా అక్కడ ధర్నా నిర్విహించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రకటించి అందుకు సన్నాహాలు చేసింది. చాలా మంది రైల్వే రిజర్వేషన్స్ కూడా చేయించుకున్నారు. అందుకే బెంగుళూరు నుండి ఢిల్లీకి, తేదీ కూడా 10 కి బదులు 13 కి మార్చారని అనుకుంటున్నారు.

అసలు అజండాలో కనీస పెన్షన్ అంశం లేనే లేదు. అయినప్పటికీ సభ్యుల విశేష అధికారాన్ని వినియోగించుకొని సీఐటీయూ జాతీయ కార్య దర్శి, సిబిటి సభ్యులు ఆర్. కరుమలైయన్ కనీస పెన్షన్ పెంపుదల గురించి సమావేశంలో ప్రశ్నించారు. దానికి కార్మిక శాఖా మాత్యులిచ్చిన జవాబు"అది ప్రభుత్వ పరిశీలనలో ఉంది". సమావేశానికి హాజరయ్యే మంత్రి వర్యులు ముందుగా చర్చించుకొని సిద్ధంగా రావాలి. పైగా కనీస పెన్షన్ పెంపుదలపై దేశవ్యాపితంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్న విషయం మంత్రివర్యులకు తెలుసు. అయినా నిర్దిష్టంగా పెంచుతామని గాని, ఇంత పెంచుతామని కానీ చెప్పక పోవడం అధికారం ఉంది కనుక ఏమైనా చెప్పవచ్చనే అహంకారామా? లేక పెన్షనర్స్ అంటే లెక్కలేని తనమా?

పార్లమెంట్ సభ్యుల వేతనాలు, అలవెన్సులు, పెన్షన్:

పార్లమెంట్ సభ్యుల వేతనాలు, పెన్షన్ లు "శాలరీ, అలవేన్సెస్ అండ్ పెన్షన్ అఫ్ మెంబెర్స్ అఫ్ పార్లమెంట్ ఆక్ట్ 1954" ప్రకారం నిర్ణయించబడతాయి. ప్రతి ఐదు సంవత్సరాలకొకసారి ఆటోమాటిక్ గా ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెరిగేలా ఆ చట్టాన్ని 2018 లో సవరించారు.

2014 లో పార్లమెంటు సభ్యుని మూల వేతనం నెలకు రూ.50,000/. పెన్షన్ రూ.20,000/. నేడు మూల వేతనం నెలకు రూ.1,24,000/. పెన్షన్ రూ. 31,000/. ఇవికాక అనేక ఇతర అలవెన్సులు పెద్ద మొత్తంలో ఉంటాయి. అవి కూడా పెరిగాయి. ప్రస్తుతానికి వాటి జోలికి వెళ్ళద్దు. కేవలం మూల వేతనం దాదాపు 150%, పెన్షన్ 50% పెరిగాయి. పెన్షన్ కోసం పార్లమెంటు సభ్యులు తమ వేతనాల నుండి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వానికి జమచేయరు. ఇలాంటి ప్రభుత్వాలు, పాలకులు మన పెన్షన్ పెంపుదలకు ఆర్థిక భారం గురించి ప్రసంగాలు చెప్పి మీరు మాడి చావండి అని చెబితే మనం చెవులప్పగించి చూస్తూ ఉండాలా? లేక పోరాడి హక్కుగా సరైన పెంపుదల సాధించుకోవాలా?

నిజంగా ఆర్థిక ఇబ్బందే కారణమా? : సాధారణ ప్రజలు బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలలో దాచుకున్న పొదుపు డబ్బును బడా పారిశ్రామికవేత్తలు రుణాల రూపంలో తీసుకున్న డబ్బులు దాదాపుగా 25 లక్షల కోట్ల రూపాయలు కేంద్ర ప్రభుత్వం (రాతపూర్వకంగా మాఫీ అనే మాట లేకపోయినా) మాఫీ చేసింది. అంతే కాదు, బడా పారిశ్రామిక వేత్తల పన్నులు తగ్గించిన కారణంగా వేల కోట్ల రూపాయల ఆదాయం ప్రభుత్వం కోల్పోయింది. కనీసం చెల్లించాల్సిన పన్నులు కూడా సక్రమంగా చెల్లించని బడాబాబులున్నారు. వారిపై ఎలాంటి చర్యలు లేవు.

ప్రతి ఒక్కరికి నెలకు కనీసంగా రూ.9000/ పెన్షన్ ఇస్తే అయ్యే అదనపు ఖర్చు సంవత్సరానికి కేవలం 68 వేల కోట్లు.

రాజ్యాంగం ఏమి చెబుతున్నది? : ఆర్టికల్ 21 ప్రకారం పౌరులందరికి జీవించే హక్కు ప్రాధమిక హక్కు. సుప్రీమ్ కోర్ట్ పౌరుల జివంచే హక్కును విస్తృతం చేస్తూ 1978 సంవత్సరం లో తీర్పు నిచ్చింది. "Not just physical existence, but the right to live with dignity and all that goes with it - such as Right to lively hood, Right to health and medical care, Right to a clean environment, Right to privacy, Right to shelter, Right to education". ఇప్పుడు పొందుతున్న పెన్షన్ తో గౌరవంగా జీవించే హక్కు ఎంతమాత్రం లేదు కదా? పోనీ ఆత్మ హత్య చేసుకుందామంటే చట్టం అనుమతించదు. (ఆత్మా హత్య చేసికోవడం కాదు. హక్కులు పోరాడి సాధించుకోవాలి)

విదేశాలలో వృద్ధుల సంక్షేమం ఎలా ఉంది? : ఎన్నడూ సంఘటిత రంగంలో పనిచేయని వారి కొరకు అలాంటి ప్రజలు చెల్లించాల్సిన అవసరం లేని పెన్షన్ పధకాలను ప్రపంచంలోని అనేక తక్కువ, మధ్య తరగతి ఆదాయాలు వచ్చే ప్రభుత్వాలు అమలు చేస్తున్నారు. వృద్ధాప్యంలో పేదరికం లేకుండా చేయడానికి సామాజిక పెన్షన్ లు ముఖ్యం. (Many low- and middle-income countries are expanding non- contributory pensions to cover people who never worked in formal sectors. Social pensions are seen as important for reducing elderly poverty). ఇది ప్రపంచ దేశాల అనుభవం . వివిధ దేశాలలో అక్కడి ధరలు, ప్రజల జీవన పరిస్థితులు ఆధారంగా ఒక్కొక్కరికి నెలకు 700 నుండి 2500 డాలర్ల వరకు పెన్షన్ పధకాలు అమలు అవుతున్నాయి.పై వాస్తవాలు పరిశీలిస్తే నెలవారి పెన్షన్ ప్రతి ఒక్కరికి కనీసం రూ.9000 చెల్లించడం తప్పనిసరి, అత్యవసరం. అలా పెరిగిన డబ్బు పెన్షనర్లు స్విస్ బ్యాంక్ లలో దొంగతనంగా దాచుకోరు. పెరిగిన మొత్తం ఖర్చు చేస్తారు. ఆ ఖర్చుపై మరల ప్రభుత్వానికి పన్నుల రూపంలో తిరిగి అదనపు ఆదాయం వస్తుంది. కొంత మేరకు అదనంగా సరుకుల ఉత్పత్తి, అందుకు కొత్త ఉపాధి అవకాశాలు ఏర్పడి దేశ జి.డి.పి. వృద్ధికి దోహద పడుతుంది. అంటే పెన్షన్ పెంపుదల ప్రభుత్వానికి భారం కాదు. దేశ అభివృద్ధికి పెట్టే పెట్టుబడి మాత్రమే.

పరిష్కారం: ప్రతి ఒక్కరికి కనీస పెన్షన్ నెలకు రూ.9000/ లకు పెంచే వరకు దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాలి. అది వృద్ధుల సమస్యగా కాక మొత్తం సమాజ అవసరంగా భావించి అందరూ భాగస్వాములు కావాలి. ప్రభుత్వం పై ఒత్తిడి పెట్టీ పెన్షన్ పెంపుదల సాధించుకోవాలి.



పాఠక మహాశయులకు విజప్తి

నమస్కారములు...

ఉమ్మడి ఆర్టీసీలో, తెలంగాణ ఆర్టీసీలో స్టాఫ్ & వర్కర్స్ ఫెడరేషన్ మాత్రమే కార్మికుల కోసం పత్రికను నిర్వహించింది. రాష్ట్ర విభజన తర్వాత “ఆర్టీసీ కార్మికుడు” పేరిట వచ్చిన ఈ పత్రిక మీ అందరి ఆదరాభిమానాలను చూరగొన్నది. ఆర్టీసీ కార్మికుల గుండె చప్పుడుగా నిలిచింది. కార్మికుల సమస్యలను ఎలుగెత్తి చాటింది. అధికారుల దృష్టికి తీసుకునిపోయింది. ఒక పత్రిక నిర్వహించాలంటే వృత్తి నిపుణులు అవసరం. కానీ “ఆర్టీసీ కార్మికుడు” పత్రికను మాత్రం వృత్తి చేసుకుంటూ, యూనియన్ కార్యక్రమాల్లో తలమునకలై ఉండే కార్యకర్తలే నడుపుతున్నారు. అత్యధిక పనిభారం మోస్తున్న ఆర్టీసీ కార్మికులే ఈ పత్రికను నడుపుతున్నారంటే ఇతర రంగాల్లో వారు ఆశ్చర్యపోతూనే ఉంటారు. పత్రికకు ఎంత ఆదరణ ఉన్నప్పటికీ గత కొంతకాలంగా మీకు అందించలేకపోయాము. ఇందుకు కారణం ఆర్థిక సమస్యలే. పత్రికను ముద్రించుటకు అయ్యే వేలాది రూపాయలు ప్రతినెలా కార్మికుల వద్ద నుండే మేము తిరిగి పొందవలసి ఉన్నది. మెజారిటీ కార్మికులు పత్రికకు చందాలు చెల్లించినా, కొందరు మాత్రం కరపత్రంలా భావిస్తున్నారు. ఇదే మాకు పెనుభారమవుతున్నది.

కార్పొరేట్ సంస్థలే పత్రికలను నడుపలేక చేతులు ఎత్తేస్తున్న రోజులివి. ప్రింట్ నుండి డిజిటల్‌కు మారుతున్న కాలమిది. ఎన్నో ఆటంకాలు వస్తున్నా పత్రికను ముద్రించటానికి సిద్ధమౌతున్నామంటే అది ఆర్టీసీ కార్మికుల పట్ల మాకున్న కమిట్‌మెంటే. మా పత్రికను మీ చేతిలో పెట్టి, మీతో అనుబంధాన్ని మరింత బలోపేతం చేయటమే లక్ష్యంగా కొనసాగుతున్నాము. అందుకే ఈ అక్టోబర్ నెల నుండి పత్రిక ముస్తాబై మీ ముందుకు వస్తున్నది. మా వ్యయప్రయాలను మీరు అర్థం చేసుకొని ఆదరిస్తారన్న విశ్వాసమే మమ్మల్ని నడిపిస్తున్నది.

అభినందనలతో..

(వీరాంజనేయులు) ఎడిటర్ - **(ఎస్.కృష్ణ)** మేనేజర్

కేరళలో అతి పేదరికాన్ని నిర్మూలించిన లెఫ్ట్ ఫ్రంట్ ప్రభుత్వం

దేశంలో తీవ్రమైన పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా అవతరించామని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటించారు. కేరళ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శనివారం జరిగిన శాసనసభ ప్రత్యేక సమావేశంలో 300వ నిబంధన కింద ఆయన ఈ మేరకు ప్రకటన చేశారు. ఈ మైలురాయి సమ్మిళిత వృద్ధిలో కేరళ నమూనాకు ఓ శాసనంగా నిలిచిపోయిందని విజయన్ చెప్పారు. స్థానికంగా తీసుకున్న చర్యలు, ప్రజల క్రియాశీల భాగస్వామ్యం ద్వారానే ఇది సాధ్యపడిందని ఆయన అన్నారు. 2021లో కేరళలో ఎల్డీఎఫ్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి జరిగిన క్యాబినెట్ సమావేశంలో అనేక ప్రధాన నిర్ణయాలు తీసుకున్నారు. తీవ్ర పేదరికం నుంచి రాష్ట్రాన్ని బయటపడేయాలన్నది అందులో ఒకటి. శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన ఈ హామీని అమలు చేయడానికి ప్రభుత్వం నడుం బిగించింది. అధికారాన్ని చేపట్టిన రెండు నెలల సమయంలోనే తీవ్ర పేదరికంతో బాధపడుతున్న కుటుంబాలను గుర్తించే ప్రక్రియను చేపట్టింది. లక్ష్య సాధనలో అన్ని ప్రభుత్వ విభాగాలు, స్థానిక సంస్థలు, ప్రజలు భాగస్వాములయ్యారు. తీవ్ర పేదరికాన్ని గుర్తించేందుకు ముందుగా వడక్కన్‌చెరీ మున్సిపాలిటీని, అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచాయతీలను ఎంచుకున్నారు. పైలట్ దశ విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు ప్రక్రియను చేపట్టారు.



కార్యాచరణ ఇలా.. : అత్యంత పేద కుటుంబాలుగా గుర్తించిన 64,006 కుటుంబాల్లో 55,861 కుటుంబాలు... అంటే 96.13 శాతం కుటుంబాలకు సెప్టెంబర్ 15వ తేదీ నాటికి తీవ్ర పేదరికం నుంచి విముక్తి లభించింది. మిగిలిన 2,148 కుటుంబాలను కూడా గత నెల 31వ తేదీతో తీవ్ర పేదరికం నుంచి బయటపడేశారు. దీంతో శనివారం నాటికి రాష్ట్రంలో అత్యంత పేద కుటుంబాలే లేకుండా పోయాయని శాసనసభ సమావేశాల్లో ముఖ్యమంత్రి పినరయి విజయన్ ప్రకటన చేశారు.

మాట ఇచ్చాం.. చేసి చూపాం : బహిరంగసభలో సినీ నటులు మమ్ముట్టికి నివేదిక అందచేసిన సీఎం పినరయి విజయన్ శాసనసభ సమావేశాల అనంతరం తిరువనంతపురంలో శనివారం సాయంత్రం నిర్వహించిన బహిరంగ సభలో 'తీవ్ర పేదరిక విముక్త రాష్ట్రం' లక్ష్య సాధనలో నాలుగేండ్ల ప్రస్తావనంపై నివేదికను మళయాళ సుప్రసిద్ధ నటుడు మమ్ముట్టికి సీఎం పినరయి విజయన్ అందచేశారు. ఈ సందర్భంగా అక్కడి కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ కడు పేదలను దారిద్ర్యం నుంచి బయటపడేసి, వారికి ఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరిచామని తెలిపారు. రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులు అందచేసి, కుటుంబశ్రీ కార్యక్రమం ద్వారా క్రమం తప్పకుండా ఆయా పేద కుటుంబాలకు ఆహారం, ఆరోగ్య సేవలు, మందులు, వ్యాక్సినేషన్లు, ఉపశమనం కలిగించే సంరక్షణ చర్యలు, అవయవాల మార్పిడి వంటి అనేక కార్యక్రమాలతో పాటు ఇండ్ల నిర్మాణం కూడా పూర్తిచేశాకే ఈ ఘనత సాధ్యమైందని వివరించారు. ఈ సందర్భంగా దారిద్ర్యం, అధిక జననాల రేటు వంటి సమస్యలను కేరళ ఎదుర్కొంటోందని 1970ల నాటి అకడమిక్ జర్నల్స్, ఐక్యరాజ్య సమితి నివేదికలను ఉటంకిస్తూ విజయన్, ఆనాటి రోజుల నుండి రాష్ట్రం ఇప్పుడు ప్రశంసనీయమైన పురోగతిని సాధించిందని తెలిపారు. వ్యవసాయ కార్యకలాపాల్లో సంస్కరణలు, ఆరోగ్య, విద్యా రంగాల్లో ప్రభుత్వ ప్రమేయంతో పాటు ప్రగతిశీల ప్రభుత్వాలు, ప్రజా ఉద్యమాలు నిరంతర జోక్యం వల్లే ఈ పురోగతి సాధ్యమైందన్నారు. ఇల్లు, భూమి లేకపోవడమనే సమస్యను పారద్రోలేందుకు గతంలో తీసుకున్న చర్యల కొనసాగింపే ఈ తీవ్రమైన పేదరిక నిర్మూలన ప్రక్రియ అని విశ్లేషించారు. ఈ సందర్భంగా ఐక్యరాజ్య సమితి పేర్కొన్న సుస్థిర అభివృద్ధి సూచికలో కేరళ గణనీయమైన పురోగతి సాధించిందని సంతోషం వ్యక్తం చేశారు. పేదరికం నుంచి బయటపడిన వారెవరూ కూడా మళ్లీ ఆ పేదరికపు కూపంలోకి పడిపోకుండా వుండేలా జాగ్రత్తలు తీసుకుంటూ, దానికోసం నిర్దిష్ట కాల వ్యవధుల్లో తనిఖీలు చేపట్టాల్సి ఉటుందని చెప్పారు.







ఎపిఎస్ఆర్టీసీ (పిటిడి) ఎస్డబ్ల్యూఎఫ్ 13వ రాష్ట్ర మహాసభలు

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి పట్టణంలో ఎపిఎస్ఆర్టీసీ (పిటిడి) ఎస్డబ్ల్యూఎఫ్ 13వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 22, 23 తేదీల్లో విజయవంతంగా జరిగాయి. ఎఐఆర్‌టిడబ్ల్యూఎఫ్ అఖిలభారత ప్రధాన కార్యదర్శి కా. జీబన్ సాహా, జాతీయ కార్యదర్శి వి.ఎస్.రావు, ఎపిసిఐటియు రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్.నర్సింగరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా. అయ్యపురెడ్డి పెట్టిన కార్వదర్శి నివేదికపై ప్రతినిధులు చర్చల్లో పాల్గొన్నారు. పలు తీర్మానాలు ఆమోదించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షులుగా ఎ.కె. జిలాని బాష, అధ్యక్షులుగా సి.హెచ్. సుందరయ్య, ప్రధానకార్యదర్శిగా కట్టా సుబ్రమణ్యం, కోశాధికారిగా సీహెచ్, అప్పడు, ప్రచారకార్యదర్శిగా టిపిఆర్ దొర ఎన్నికయ్యారు. మరో 17 మంది ఆఫీసు బేరర్లుగా ఎన్నికయ్యారు. తెలంగాణా నుండి ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు సౌహర్ద సందేశం ఇచ్చారు. టిఎస్ఆర్‌టిసి ఎస్డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కా.పి.రవిందర్‌రెడ్డి, ఎస్డబ్ల్యూఎఫ్ వ్యవస్థాపక కార్యదర్శి కా. వి.రాములు పాల్గొన్నారు.











ఆశా రేఖ

నిరాశ కమ్ముకున్న ప్రతి సారి
ఎక్కడో ఒక దగ్గర
ఆశా రేఖ తళుక్కున మెరుస్తుంది

అది ట్రంపోన్మాదాన్ని
ధిక్కరించిన న్యూయార్క్ గానో
మతోన్మాదాన్ని
ఊడ్చేసిన జె.ఎన్.యు గానో
ఐక్యతను చేతల్లో చూపిన
నేపాల్ రెడ్ షర్ట్స్ గానో
తటిల్లున మిరుమిట్లు గొలుపుతుంది

ఆ వెలుగు రేఖలో
కమ్మిన నిరాశ
వెనక పట్టు పడుతుంది
ఆలోచనల్ని సరి చూసుకొని
హృదయాన్ని శృతి చేసుకొని
అభ్యుదయ గానాన్ని ఆలపిస్తాను

వసంత మేఘాలు మళ్ళీ ఘర్జిస్తాయని
ఆకు రాల్చిన వనాలు
బంజరు భూములు చిగురిస్తాయని
విశ్వాసాన్ని ప్రకటిస్తూ
సమరాంగణానికి సన్నద్ధ మవుతాను

- వి.ఆర్. తూములూరి

పోరు దారే వారి దారి

వట్టి మనుషులు కాదు మీ లాగా
వాళ్లు మనసున్న మనుషులు
మనుషుల్ని నమ్మే మనుషులు

నగరాన్ని
నూతనంగా ఉంచే
మనుషులు

మిమ్మల్ని మనుషులనీ నమ్మి
మీరు ఇచ్చిన వాగ్దానం
గుర్తు చేయడానికి వచ్చారు

మీరు లాటీలను
నిలిపారు పోటీగా
మీకు మారుగా

మనసు లేని లాఠీ
చూసింది రక్తాన్ని
దాని కళ్ళ నిండా

మీరు కొట్టిన దెబ్బలు వాళ్ల శరీరాలను
గాయపరిచి ఉండొచ్చు గాక
వాళ్ల హృదయాలను దృఢ పరుస్తాయి

వాళ్లకు అండగా ఉండేది
త్యాగాల జెండా
పోరాటాలే దాని చరిత్ర నిండా

హక్కుగా భుక్తి కోసం
ఇక ఎర్రజెండా చేతిన
పోరు దారే వారి దారి

- దేవరపల్లి రమణయ్య,
ఆర్టీసీ కండక్టర్, నెల్లూరు

తప్పెవరిది...???

అనంతమైన ఆశయాలతో...
అలుపెరుగని పోరాటాలతో...
అనాదిగా బిగుసుకున్న.. బానిస
సంకెళ్ళను.. తెంచేందుకు.. ఉద్యమాలకు
ఊపిరులూది.. పౌరుషాగ్ని రగిలించి..
అభాగ్యుల పాలిట అండగ
నిలిచి..జయకేతనం
ఎగరేసి. స్వేచ్ఛావాయువులను
భారతజాతికందిస్తే..స్వతంత్ర
ప్రజాస్వామ్యం ప్రకటిస్తే..నేడది
అప్రజాస్వామ్యంగా మారింది.!
అవినీతి అక్రమాలకు అడ్డాగా..



రూపుదిద్దుకుంది.
కుల వివక్షతలతో...
మత మౌఢ్యాలతో...
ఆర్థిక అసమానతలతో..
జన జీవనం విచ్ఛిన్నమౌతోంది.
పాలకులే అక్రమాల ఏలికలైతే
దేశ గమనం ఎటు పోతోంది..?
మన దేశ గమ్యం ఏమౌతోంది?
ఎటు విన్నా అరాచకాలే....
ఎటు కన్నా అక్రమాలే...
అమాయక ప్రజల మాన ప్రాణాలతో..
చెలగాటాలే...!
జనజీవనం..అయోమయం!
జాతి భవిత అగమ్యగోచరం.!
ఈ తప్పెవరిది?తప్పెవరిది??
మనం నిర్మించుకున్న అవినీతి కంచుకోటది
కాదా????????

- తాతోలు దుర్గాచారి, భద్రాచలం.
చరవాణి:9676357648.

జ్ఞాన వృక్షం డాక్టర్ అంబేద్కర్

తరతరాల చీకట్లను తొలగించిన వెలుగు బావుటా
భరత జాతి వెలుగులీను ఔన్నత్యం
సాధించిన క్రాంతి దర్శి
సవాలక్ష పీడనలను పారద్రోలిన సమతా మూర్తి

జాత్యహంకార ఎల్లల్ని ఛేదించి జ్ఞాన వృక్షం నాటిన దార్శనికుడు
ప్రాక్పశ్చిమ సిద్ధాంతాల ఔపోసన రాజ్యాంగ రూపకల్పన
ఒక నవయుగ ఆవిర్భావం

మలినం చేసిన మానవ వికృతాలు
ఖండించి నిలదీసిన విప్లవ శంఖం నేటికీ సమాజాన్ని
శాసిస్తున్న కులమత దౌష్ట్యాల పునాదుల్ని ఛీదరించిన ధీశాలి

పీడిత తాడిత అణగారిన మూగజీవుల్లో ఆత్మవిశ్వాసం
నింపిన ఆది గురువు
ఒక ఉప్పెనై వ్యవస్థ మార్పుకై తపించిన దూరదృష్టి

ఆధునిక భరత వేదాంతమైన భారత రాజ్యాంగం
అతని తపోదీక్షలో ప్రభవించిన సార్వజనీన సంక్షేమ మూల గ్రంథం
తరాల అంతరాల అడ్డుగోడల్ని కూల్చిన నిత్య సత్యాన్వేషి
మానవీయతాదర్పణమై భాసించే మహోన్నత మానవతా
మూర్తి సర్వోన్నత లక్ష్యాల సాధనకై ప్రగతిదారుల
పయనించిన పథ నిర్దేశకుడు

మానవుల్ని ఏకీకృతం చేయజాలని
విశ్వవ్యాప్త సిద్ధాంతాల శోధనలు
అపర బోధిసత్వుడై సమత మమతల్ని పంచిన సర్వోన్నతుడు
నవ భారత నిర్మాణంలో శాశ్వత
క్రాంతిరేఖలు విరజిమ్మే జ్వాలాముఖి
డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్

(డా బి. ఆర్. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా)

- కే.లక్ష్మణ్ గౌడ్, లుంబిని, మహబూబ్‌నగర్. సెల్ : 9704930509

COMMUNIST PARTY OF INDIA (MARXIST)
Telangana State Committee
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

తేది: 13. 11. 2025
హైదరాబాదు

శ్రీ ఎ రేవంత్‌రెడ్డి గారు,
గౌరవ ముఖ్యమంత్రి,
తెలంగాణ రాష్ట్రం,
హైదరాబాదు.

విషయం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న విద్యుత్ బస్సుల విధానంలో మార్పుచేసి, ఆర్టీసీకే అవకాశం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని- రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతూ...

ఆర్యా!

ప్రత్యామ్నాయ ఇంధనం, కాలుష్యనియంత్రణ పేరుతో కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రమాదకరమైన విద్యుత్ బస్సుల విధానాన్ని తీసుకొస్తున్నది. బస్సుల నిర్వాహణ మొత్తం ప్రయివేట్, కార్పోరేట్‌లకు కట్టబెట్టి, ఆయా కంపెనీలకే కేంద్ర ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు సబ్సిడీగా ఇస్తున్నది. అత్యంత విలువైన ఆర్టీసీ భూములు కూడా ప్రయివేట్ విద్యుత్ బస్సుల సంస్థలకు కట్టబెడుతున్నారు. కానీ విద్యుత్ బస్సులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన బాధ్యత మాత్రం ఆర్టీసీలకు కేటాయిస్తున్నది. అలాగే టెండర్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ "Conver-gence Energy Services Ltd (CESL) ఫైనల్ చేసి, ఆర్టీసీపై పెను భారం వేస్తున్నది. తక్షణమే ఈ విధానంలో మార్పులు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతున్నాను.

ప్రైవేట్ విద్యుత్ బస్సుల డ్రైవర్లు మరియు మెయింటనెన్స్ తదితరాలన్నీ ప్రయివేట్ కంపెనీలదే బాధ్యత. ఇది రెండు రకాలుగా నష్టం. ఆర్టీసీలో వున్నట్లు రూల్ ఆఫ్ రిజర్వేషన్లు అమలు కావు. ఆయా కంపెనీలు తక్కువ వేతనంతో సిబ్బందిని నియమించుకోవడం వల్ల బలహీన, వెనుకబడిన తరగతుల నిరుద్యోగులకు తీవ్రనష్టం జరుగుతుంది. ఇప్పటికే పని చేస్తున్న డ్రైవర్, కండక్టర్, మెకానిక్‌లతో పాటు, మిగతావారు అదనపు సిబ్బందిగా మిగలడంతో, వారి ఉద్యోగ భద్రతకే ప్రమాదం వాటిల్లుతోంది.

మన రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ బస్సుల పథకాలను సమర్థిస్తూ, రాష్ట్రంలో వెంటనే 2800 ఆర్టీసీ బస్సులను మరియు 2030 నాటికి మొత్తం 9800 ఆర్టీసీ బస్సులను విద్యుత్ బస్సులుగా మారుస్తామని విధాన ప్రకటన చేసింది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం తమ ప్రజల అవసరాల మేరకు బస్సులు సమకుర్చుకొనే అవకాశం వుండదు. బస్సుల నిర్వహణ ఖర్చు, ఆదాయానికి మధ్య వ్యత్యాసం పెరిగి ఆర్టీసీకి పెనుభారంగా మారుతుంది.

విద్యుత్ బస్సుల మౌలిక అవసరాల కల్పన బారాన్ని ప్రయాణీకులపై వేస్తున్నారు. రాష్ట్రంలో ఇప్పటికే విద్యుత్ బస్సుల్లో రు. 10, రు. 20లు అదనంగా చార్జీని వసూలు చేస్తున్నారు. నగరంలో తిరుగుతున్న అన్ని రకాల బస్సుల్లో ప్రయాణించే వారిపై రు. 5, రు. 10లు టికెట్ ధరలు పెంచి అదనపు భారం వేసింది.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, విద్యుత్ బస్సుల విధానంలో మార్పులు చేసి ఆర్టీసీలకే నిధులు ఇవ్వాలని, విద్యుత్ బస్సుల కొనుగోలు, మెయింటనెన్స్, నిర్వహణను ఆర్టీసీయే చేసేలా చూడాలని, ప్రజా రవాణా సంస్థలను సామాజిక బాధ్యతగా చూసి ఖర్చుకు-ఆదాయానికి మధ్య వస్తున్న వ్యత్యాసాన్ని ప్రభుత్వాలు భరించాలని కోరుతున్నాను. దీని కోసం కేంద్రంపై రాష్ట్రప్రభుత్వం ఒత్తిడి తెచ్చి, మన రాష్ట్రంలో అమలుకు పూనుకునేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

(జాన్ వెస్లీ)
రాష్ట్ర కార్యదర్శి

మోడీ ప్రభుత్వం గారడీ – జీఎస్టీ రేట్ల సవరణ



ప్రభాత్ పట్నాయక్
ప్రముఖ ఆర్థికవేత్త

వస్తు, సేవల ఆధారిత పన్ను (జీఎస్టీ) రేట్లలో చేసిన సవరణల గురించి మోడీ ప్రభుత్వం చాలా గొప్పలు పోయింది. ప్రభుత్వం ప్రదర్శించిన దయాగుణం గురించి దాని ప్రచార యంత్రాంగం ఓవర్‌టైం చేసి మరీ తెగ ప్రచారం చేసింది. సామాన్యుడికి చాలా అవసరమయిన సమయంలోనే, అంటే పండుగల సీజన్ లోనే, అతగాడిమీద భారాన్ని మోడీ ప్రభుత్వం తగ్గించి ఏవిధంగా ఊరట కల్పించిందో వివరించే ప్రకటనలను గుప్పించింది. జీఎస్టీ రేట్ల సవరణ వలన 390కి పైగా సరుకులు ఏవిధంగా చౌకగా లభిస్తున్నాయో తెలియజేస్తూ రకరకాల ప్రకటనలను ఢిల్లీ మెట్రోలోని ప్రతీ రైలు బోగీ ప్రదర్శించింది. ఆ ప్రకటనల మీద ప్రధాని మోడీ, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తాల చిత్రాలు ప్రముఖంగా కనిపించాయని వేరే చెప్పనక్కరలేదు. ఇక కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ దీపావళి అమ్మకాల్లో గణనీయమైన వృద్ధి ఏవిధంగా కనిపిస్తోందో పదే పదే ప్రకటిస్తూనే వచ్చారు. జీఎస్టీ రేట్ల సవరణ వలన మోటారు వాహనాల ధరలు తగ్గిపోయి ఏయే బ్రాండ్ల కార్ల అమ్మకాలు ఎంతెంత పెరిగాయో వార్తాపత్రికలు కథనాల మీద కథనాలు గుప్పించాయి.

మహా అయితే, ఇదంతా పరిస్థితిని ఒకవైపు నుంచి చూపించే ప్రయత్నం మాత్రమే. దీనికి వున్న రెండో వైపును చాలా జాగ్రత్తగా కనపడనివ్వకుండా చూసుకుంటున్నారు. జీఎస్టీ సవరణల ఫలితంగా ప్రభుత్వానికి తగ్గే పన్ను ఆదాయం గురించి, దాని పర్యవసానాల గురించి ఎక్కడా మాట్లాడడం లేదు. కొంతమంది ప్రభుత్వ ఆర్థిక వేత్తలైతే రేట్లు సవరించినందువలన జీఎస్టీ ద్వారా ప్రభుత్వానికి లభించే ఆదాయంలో తగ్గుదల పెద్దగా ఉండబోదని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. రేట్లు తగ్గినందువలన సరుకుల అమ్మకాలు పెరుగుతాయని, రేటు తగ్గినందువల్ల తగ్గే ఆదాయం కాస్తా అమ్మకాలు పెరగడం ద్వారా భర్తీ అయిపోతుందని వారు ప్రకటిస్తున్నారు. ఇది సాధ్యం కాదని దిగువ వివరణ స్పష్టం చేస్తుంది. జీఎస్టీ రేట్లు తగ్గించక ముందు ఒకానొక వస్తువు ధర రూ. 100 ఉందని, దానిమీద 28 శాతం జీఎస్టీ ఉండేదని అనుకుందాం. జీఎస్టీ రేట్లు 28 నుంచి 18 శాతానికి తగ్గించినందువలన దాని అమ్మకం రేటు రూ. 128 నుంచి రూ. 118కి తగ్గుతుంది.

అంటే 8 శాతం తగ్గింది. దీనివలన ప్రభుత్వానికి తగ్గిపోయే పన్ను ఆదాయం అమ్మకాలు పెరగడం ద్వారా భర్తీ కావాలంటే ఆ వస్తువు అమ్మకాలు 56 శాతం పెరగాలి. అలా పెరగాలంటే ఆ వస్తువుకు మార్కెట్ లో ఉన్న డిమాండ్ 56 శాతం పెరగాలి. అంత మేరకు మార్కెట్‌లో డిమాండ్ పెరగడం అనేది అసాధ్యం. అందుచేత ప్రభుత్వ ఆదాయంలో గణనీయంగా తగ్గుదల ఉండబోతుంది అన్నది ఎవరూ నిరాకరించలేని సత్యం. ఒకవేళ పన్ను రేట్లు తగ్గినది ఎక్కువమంది ప్రజలు తరచూ కొనుగోలు చేసే వస్తువుల మీద అయివుంటే అప్పుడు పరిస్థితి వేరుగా ఉండే అవకాశం ఉండేది. ధరలు తగ్గినట్లు ప్రకటించగానే, ఆ సరుకులను అనేకమంది ఒక్క సారి అదనంగా కొనుగోలు చేస్తారు. అప్పుడు వాటి అమ్మకాలు పెరిగి ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయంలో "వెంటనే" తగ్గుదల ఉండదు. కాని ఒక్కసారి కొన్నప్పటికీ ఆ వస్తువులను ఉపయోగించడానికి కొంత సమయం పడుతుంది గనుక రేట్లు తగ్గిన వెంటనే జరిగిన స్థాయిలో వాటి అమ్మకాలు ఆ తర్వాత కాలంలో అదే స్థాయిలో కొనసాగవు. అప్పుడు ప్రభుత్వానికి ఆదాయం తగ్గుతుంది. అయితే ఈ తగ్గుదల వెంటనే కనిపించదు.

ప్రస్తుతం మోటారు వాహనాల అమ్మకాలు పెరిగినందువలన ప్రభుత్వానికి వచ్చే పన్ను ఆదాయం తగ్గకుండా యథాతథంగా కొనసాగుతుందన్న వాదన పూర్తిగా తప్పు. ప్రతీయేడూ వాటి అమ్మకాలలో పెరుగుదల రేటు ఇదే స్థాయిలో కొనసాగడం అసాధ్యం. ప్రభుత్వానికి పన్ను ఆదాయం తగ్గినందువలన కలిగిన లోటును కేంద్రం, రాష్ట్రాలు పంచుకోవాల్సి వుంటుంది. దీనిగురించి తర్వాత చర్చిద్దాం. ప్రభుత్వానికి ఆదాయంలో కలిగే లోటును భర్తీ చేయడానికి అదనపు వన రులను కేంద్ర ప్రభుత్వం వెతుక్కోవాలి. సంపన్నుల మీద అదనంగా పన్ను విధించవచ్చు. కాని ఈ ప్రభుత్వం ఎంతసేపూ ఆ సంపన్నుల వల్లే "అభివృద్ధి" సాధ్యం అంటూ వల్లిస్తూ వాళ్లని అన్ని రకాలుగానూ వెనకేసుకు వస్తుంది. అందుచేత ఆ సంపన్నుల మీద అదనపు పన్ను విధించే ఆలోచనే దానికి లేదు. ఇక మిగిలినది శ్రామిక ప్రజలు. వాళ్లమీద అదనపు పన్నుల భారాన్ని మోపడం అంటే అప్పుడు జీఎస్టీ రేట్ల సవరణ ఫలితంగా ప్రజల మీద భారం తగ్గిందని చేసుకుంటున్న ప్రచారం కాస్తా వట్టి బూటకం అని తేలిపోతుంది. ఏది ఏమైనా ప్రస్తుతం ప్రభుత్వం శ్రామిక ప్రజలమీద అదనపు

పన్ను భారం మోపే ప్రతిపాదన ఏదీ చేయలేదు.

ఇక ద్రవ్యలోటును పెంచే అవకాశం కూడా లేదు. కేంద్రమే కాదు, రాష్ట్రాలకూ అటువంటి అవకాశం లేదు. నిజానికి కేంద్రం ప్రస్తుతం తన ద్రవ్యలోటును ఇప్పుడున్న స్థాయికన్నా ఇంకా దిగువకు తగ్గించే ప్రయత్నంలో ఉంది. కనుక జీఎస్టీ రేట్ల మార్పుల ఫలితంగా ప్రభుత్వం ఆదాయం తగ్గడం, దాని ఫలితంగా ప్రభుత్వం చేసే వ్యయం తగ్గడం అనివార్యం. ప్రభుత్వ వ్యయంలో తగ్గుదల ఎక్కడెక్కడ ఉండే అవకాశం ఉంది? ప్రజా వైద్య సేవలకు, ప్రభుత్వ విద్యకు చేసే ఖర్చు తగ్గిపోయే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ రెండు రంగాలలోనూ పెద్ద స్థాయిలో ప్రయివేటీకరణ జరిగింది. ప్రభుత్వం ఈ రెండు రంగాలమీద చేసే ఖర్చు కూడా తగ్గింది. రాబోయే కాలంలో ఇది మరింత తగ్గుతుంది. అప్పుడు శ్రామిక ప్రజానీకం మరింత ఎక్కువగా ప్రయివేటు విద్య, వైద్యం మీద ఎక్కువ ఖర్చు చేయ వలసిన అగత్యం ఏర్పడుతుంది. దాని ఫలితంగా వారి కొనుగోలుశక్తి బాగా పడిపోతుంది. అంటే జిఎస్‌టి రేట్ల తగ్గింపు చేసి ప్రభుత్వం ప్రజలకు కుడి చేత్తో ఇచ్చినది కాస్తా ఎడం చేత్తో లాగేసుకుంటుందన్నమాట.

అంతటితో అయిపోలేదు. ఇప్పుడు జీఎస్టీ రేట్ల తగ్గింపు వలన ప్రయోజనం లభించేది కేవలం సామాన్యులకు మాత్రమేనా?ఎంతమాత్రం కాదు. సంపన్న వర్గాలకూ ప్రయోజనం లభిస్తుంది. ఇప్పుడు మోటారు వాహనాల అమ్మకాలు బాగా పెరిగాయంటే ఆ ప్రయోజనం సంపన్నులకే వచ్చిందని కనిపిస్తోంది. కాని, అనివార్యంగా తగ్గనున్న ప్రభుత్వ వ్యయం వలన ఎక్కువగా దెబ్బ తినేది మాత్రం శ్రామిక ప్రజలే. వాళ్లకి ప్రస్తుతం కాస్తంతగానైనా విద్యా వైద్య రంగాల్లో లభిస్తున్న ప్రభుత్వ సేవలు ఇంకా తగ్గిపోయి ప్రయివేటు సేవలను కొనుగోలు చేయలేని స్థితిలో పడిపోతారు. ఈ రెండు రంగాలే కాదు. పెన్షన్ల చెల్లింపుల్లో జాప్యం జరుగుతుంది. ఉపాధి హామీ పథకం కింద చేసిన పనులకు చెల్లించవలసిన కూలీ ఇప్పటికే బకాయి పడుతోంది. ఇకముందు ఇంకా ఎక్కువ బకాయి పడనుంది. అంటే జిఎస్‌టి రేట్లు సవరించినందు వలన శ్రామిక ప్రజానీకానికి ఒరిగిన ప్రయోజనం కన్నా నష్టమే ఎక్కువ. ఇది సమాజంలో నెలకొన్న ఆర్థిక అసమానతలను మరింత పెంచుతుంది. జీఎస్టీ రేట్లను తగ్గించినందువలన కొన్ని సరుకుల రేట్లు వెంటనే తగ్గుతాయి. దానిని ప్రజలకు చూపిం చవచ్చు. తన ఘనతగా ప్రభుత్వం ప్రచారం చేసుకోవచ్చు. ప్రభుత్వ వ్యయం తగ్గిపోయి ప్రజల ఇబ్బందులు పెరిగేది దీని ఫలితంగానే అయినా దాని ఫలితంగా తలెత్తే వ్యతిరేకత వెంటనే కనిపించదు. ఒకవైపు సంపద అసమానతలను, పేదరికాన్ని పెంచే దిశగా జీఎస్టీ రేట్లను తగ్గిస్తూనే. దాని వలన నష్టపోయే పేదలకే ఏదో మహోపకారం చేస్తున్నట్టు చెప్పుకోవచ్చు. అదే మోడీ ప్రభుత్వం చేస్తున్న గారడీ. అయితే, మనం జీఎస్టీ రేట్ల తగ్గింపును తప్పుబట్టాలా? అక్కరలేదు. కాని మనం నొక్కి చెప్పవలసిన విషయం ఇక్కడ ఒకటి ఉంది. జీఎస్టీ రేట్ల తగ్గింపు వలన ప్రభుత్వానికి ఎంత ఆదాయం తగ్గనుందో, అంతే మోతా దులో సంపన్నుల మీద ఏదో విధంగా భారం పెంచి వారి నుంచి అదనంగా వసూలు చేయాలి.

అప్పుడే జిఎస్‌టి తగ్గింపు వలన సామాన్యులకు ప్రయోజనం కలుగుతుంది. ఈ నిర్ణయం పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనిదే. అటువంటి నిర్ణయం చేసే పరిస్థితి ఈ కేంద్ర ప్రభుత్వానికి లేదు. ఒకవేళ ఏమైనా పన్ను పెంచినా దాన్ని రాష్ట్రాలతో పంచుకునే పరిస్థితే లేదు. అందువలన జీఎస్టీ రేట్ల తగ్గింపు ఫలితంగా రాష్ట్రాల ఆదాయాలు మరింతగా తగ్గిపోతాయి. అంతేగాక విద్య, వైద్యం. పెన్షన్లు వగైరా సేవలకు పడే కోతలను ప్రజలు రాష్ట్ర ప్రభుత్వాల నిర్వాకంగానే పరిగణిస్తారు. తమ రాష్ట్రాల బడ్జెట్‌ల ద్రవ్యలోటును పెంచుకునే స్వేచ్ఛ రాష్ట్ర ప్రభుత్వాలకి లేకుండా చేశారు. దీనంతటి పర్యవసానంగా రాష్ట్రాల ఆర్థిక పరిస్థితి మరింత దిగజారుతుంది. జీఎస్టీ రేట్ల సవరణ ప్రహసనాన్ని మొత్తంగా పరిశీలిస్తే రేట్లు తగ్గించిన ఘనత మోడీ ప్రభుత్వానికి దక్కితే, ఆర్థిక అసమానతలు పెరిగి, సంక్షేమంలో కోత ప్రజలకు మిగులుతుంది. రాష్ట్రాల ఆర్థిక పరిస్థితులు మరింత దిగజారుతాయి.



విద్యుత్ బస్ ల విధానం లో మార్పులు చేయాలన్న కరపత్రం బస్ భవన్ వద్ద పంచుతున్న ఎస్‌దబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, రాష్ట్ర నాయకులు పి.వి.రావు



స్థానిక సమస్య ల పరిస్కారం కోసం రాజేంద్ర నగర్ మేనేజర్ కు మెమోరాండం సమర్పణ

గ్రాట్యుటీ పూర్తిస్థాయిలో చెల్లింపు



కె.ఎస్.రెడ్డి
ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర కోశాధికారి

సర్క్యులర్ పి.డి. 27/2025 తేది : 29.9.2025.

ఉద్యోగ విరమణ చేసిన అధికారులు / ఉద్యోగులు గ్రాట్యుటీ చట్టం 1972 ప్రకారం ప్రతి ఒక్క సంవత్సర సర్వీసు 15 రోజుల వేతనం చొప్పున చెల్లించబడటానికి అర్హులు. సర్కులర్ నం.పి.డి.06/2019 ప్రకారం 35 సం.లకు మించి సర్వీసుకు చివరి నెల తీసుకున్న వేతనానికి (పే+డి.ఎ)కి 20 రెట్లు చెల్లించబడుతున్నలు. ప్రస్తుతం ఇచ్చిన సర్కులర్ ప్రకారం, గ్రాట్యుటీ చట్టం, సెక్షన్ 4(2) మేరకు కింది సూత్రం ప్రకారం పూర్తి సర్వీసుకి (35 సం.ల సర్వీసు మించిన వారికి కూడా) గ్రాట్యుటీ చెల్లించబడుతుంది.

$$\frac{\text{(చివరి నెల వేతనం + డి.ఎ) X పర్వీసు X 15 రోజులు}}{26}$$

వివరణ: 1) వేతనం అంటే బేసిక్ + పర్సనల్ పే.

2) డి.ఎ. అంటే రిటైర్మెంట్ అవుతున్న నెలలో రావల్సిన డి.ఎ.

3) సర్వీసు అంటే ఉద్యోగంలో చేరిన తేదీ నుండి రిటైర్ అయ్యే నెల వరకు, క్యాజువల్/కాంట్రాక్టు/డెయిలీ వేజ్ /NMR/ మొ. కాలమంతా కూడా సర్వీసుగా లెక్కిస్తారు. 6 నెలలకు మించిన సర్వీసు ఒక సం. కింద పరిగణిస్తారు.

4) ఉద్యోగి రిటైర్ అయ్యే నెలలో ఏ తేదీన ఇంక్రిమెంటు కలిసే తేది ఉన్నా గ్రాట్యూటి కోసం పరిగణనలోకి తీసుకుంటారు. **కామెంట్ :**1) ఈ సర్క్యులర్ జారీ చేసిన తేది నుండి మాత్రమే అమణలోకి వస్తుంది. జూన్ 2019 నుండే ఈ సర్క్యులర్ అమలు చేసి, 20 మూల వేతనాలు గ్రాట్యుటీ చెల్లించిన వారందరికి పూర్తి గ్రాట్యుటీ చెల్లించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ డివుండ్ చేస్తున్నది.

2) గ్రాట్యుటీ చట్టాన్ని సవరించి ప్రతి సంవత్సరానికి 15 రోజుల వేతనాన్ని 30 రోజులుగా పెంచాలని సి.ఐ.టి.యు. చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నది. అధికారంలో ఉన్న కానీ బిజెపీ, కాని కాంగ్రెస్ గాని పెంచలేదు.

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులుగా కా. ఆర్. సుధాభాస్కర్

ఆర్టీసీ స్టాఫ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా సిఐటియు సీనియర్ నాయకులు కా. ఆర్. సుధాభాస్కర్ గారు ఎన్నికయ్యారు. నవంబర్ 8వ తేదిన హైద్రాబాద్‌లో ఎస్‌డబ్ల్యూఎఫ్ విస్తృత రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కా. సుధాభాస్కర్ గారిని ఏకగ్రీవంగా ఎస్‌డబ్ల్యూఎఫ్ గౌరవాధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఇటీవల ఖమ్మంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర మహాసభ జరుపుకొని నూతన నాయకత్వాన్ని ఎన్నుకున్నది. అయితే గౌరవాధ్యక్షుల స్థానం ఖాళీగా ఉన్నది. 1990 నుండి కార్మికోద్యమంలో, ఉమ్మడిరాష్ట్రంలో కా. సుధాభాస్కర్ కీలకపాత్ర పోషించారు. ఉమ్మడి రాష్ట్ర సిఐటియు ప్రధానకార్యదర్శిగా, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు.



ఇదే సమావేశంలో తెలంగాణా రాష్ట్ర పబ్లిక్ & ప్రైవేటు ట్రాన్స్‌పోర్టు కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కా. పుప్పాల శ్రీకాంత్ గారికి ఎస్‌డబ్ల్యూఎఫ్ సమావేశాలకు ప్రత్యేక ఆహ్వానితులుగా పిలవాలని నిర్ణయించింది.





చెన్నైలో జరిగిన విద్యుత్తు బస్సుల సెమినార్‌కు ఈదురు వెంకన్న ప్రధాన కార్యదర్శి-ఈయూూ, సుద్దాల సురేష్, ప్రధాన కార్యదర్శి-బి.డబ్ల్యూయు లను ఆహ్వానిస్తున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ నాయకత్వం

ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర విస్తృత సమావేశం - దృశ్యాలు





నివేదిక ప్రవేశపెడుతున్న ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.ఎస్.రావు, అధ్యక్షులు వీరాంజనేయులు



కె.ఎస్.రెడ్డి, కోశాధికారి



వి.శ్రీనివాస్ (కరీంనగర్)



ఇసంపల్లి శామ్యూల్ (ఖమ్మం)



జంగయ్య (జి.హెచ్.ఎం)



ఎస్. వెంకటయ్య (మ.నగర్)



ఉపేంద్రాచారి (వరంగల్)



వై.ఎన్.రావు (ఖమ్మం)



రాష్ట్ర కమిటీకి విరాళం అందిస్తున్న కె.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.ఎ.(ఎఫ్)

TELANGANA RTC KARMIKUDU (Monthly) Date of Publication 31-11-2025 Date of Posting: 03-012-2025. RNI No.TELTEL/2015/62762, Reg. No.L1/HQ/SD/519/2022-2024
Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyderabad-50001







కరీంనగర్ నూతన జోనల్ కమిటీ

Printed and Published by V Sreenivas Rao on behalf of TSRTC STAFF & WORKERS FEDERATION, Printed at M/s. Prajasakti Daily Printing Press, # 21/1, MH Bhavan, Near RTC Kalyana Mandapam, Azamabad, Hyderabad-500020, Telangana State and Published from H.No. 1-7-130/5, NPR Bhavan, Zamistanpur, Musheerabad, Hyderabad - 500020, Telangana State, and owned by TSRTC STAFF & WORKERS FEDERATION, Editor: V. Sreenivas Rao, RNI Regd.No.TELTEL/2015/62762, e mail: rtckarmikudu2022@gmail.com, Ph. 040-27611974, Fax 040-27636769